www.vishalabharati.com
epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్
08.01.2024
సంపుటి: 2, సంచిక: 79

# విశాల భారతి
తెలుగు దిన పత్రిక



## వైభవంగా కొమురెల్లి మల్లన్న లగ్గం

- బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలను పెళ్లాడిన మల్లన్న
- స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు.. కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్
- రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- అంగరంగ వైభవంగా రథోత్సవం

మిగతా 2లో

- నెల టైమ్‌లో తనదైన మార్క్‌పాలన
- సాహసోపేత నిర్ణయాలతో ముందుకు..
- సహచర మంత్రులతో టీమ్ వర్క్..
- మార్పునకు శ్రీకారం చుడుతున్న సీఎం
- లోక్‌సభ ఎన్నికల్లోనూ సత్తా చాటేందుకు వ్యూహం




### ముఖ్యమంత్రిగా..

# రేవంత్.. వన్ మంత్!

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి.. నెల రోజులు పూర్తి చేసుకున్నారు. ఐదేండ్ల పదవీకాలంలో ఒక నెల అంటే చాలా తక్కువ సమయం.. అయితే ఈ తక్కువ సమయంలోనే రేవంత్ తనదైన మార్క్ పాలన చూపారా? పరిపాలనలో ఆయన తన ముద్ర వేసుకుంటున్నారా? ఈ 30 రోజుల్లో అసలు సీఎంగా ఆయన ఏం చేశారు. ఎలాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు? పరిపాలన అయినా, రాజకీయం అయినా సింగిల్‌గా సాగిపోతున్నారా? అందరితో కలిసి నడుస్తున్నారా? పాలనా పరంగా ఎలాంటి మార్పులు తెచ్చింది? ఇదే అందరి నోట నానుతున్న ప్రశ్న..!

డిసెంబర్ 7 తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. జనవరి 7కి.. 'రేవంత్ వన్ మంత్' పరిపాలన పూర్తి చేసుకున్నారు. అయితే ఈ నెల రోజుల్లో పరిపాలనలో ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేశారు రేవంత్. అధికారం చేపట్టగానే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రెండింటిని 48 గంటల్లో అమలు చేశారు. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలోని మహిళలందరికీ ఫ్రీ బస్ సౌకర్యం అమలు చేయడంతో మహిళా లోకం మురిసిపోయింది. ఆ తర్వాత ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచారు. ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి.. ప్రజలు తమ గోడు చెప్పుకునేందుకు ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఆ తర్వాత పేపర్ లీకులతో వీక్ అయిపోయిన టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. 'నేనున్నా..' అంటూ నిరుద్యోగులకు భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. దానికోసం ఢిల్లీకి వెళ్లి యూపీఎస్సీ చైర్మన్‌తో భేటీ అయ్యారు. ఇక సీఎం అవగానే ఐఏఎస్, ఐపీఎస్‌ల మార్పులు చేర్పులకు శ్రీకారం చుట్టారు. డ్రగ్స్ అనే మాట తెలంగాణలో వినపడకూడదంటూ సన్ బర్న్ లాంటి ప్రోగ్రామ్‌లకు అడ్డుకట్ట వేసి భవిష్యత్‌లో తన వైఖరి ఏమిటో చూపించారు.

పరిపాలనలోనే కాకుండా ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో కూడా తనదైన మార్క్‌తో దూసుకెళ్తున్నారు సీఎం. ముఖ్యమంత్రి అయ్యాక నేనొక్కడినే అన్నట్లు కాకుండా మనమందరం అంటూ ముందుకు సాగుతున్నారు. హైదరాబాద్‌లో అయినా, ఢిల్లీ పర్యటనలో అయినా తన మంత్రివర్గ సహచరులను కలుపుకుపోతున్నారు. మిగతా 2లో



## సంకెళ్లను తెంచి.. స్వేచ్ఛను పంచి..

- నెలరోజుల పాలన కొత్త అనుభూతినిచ్చింది
- పేదలు, యువత, ఆడబిడ్డల ముఖాల్లో ఆనందం చూశా
- మా నడక తెలంగాణ ఉజ్వల భవిష్యత్‌వైపు అడుగులు..
- తెలంగాణ సమాజం నన్ను గుండెల్లో పెట్టుకుంది
- ఇక ముందు కూడా ఇదే ఉత్సాహంతో నా బాధ్యత నిర్వర్తిస్తా
- కాంగ్రెస్‌పాలనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆసక్తికర ట్వీట్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి నెలరోజులు పూర్తి చేసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ విజయం సాధించడంతో డిసెంబర్ 7న ఆయన సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. అప్పటి నుంచి తనదైన మార్క్‌పాలనతో ఆయన ముందుకు సాగుతున్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రెండింటిని అమలు చేస్తోంది. ఇతర హామీల అమలు కోసం ప్రజాపాలన పేరుతో రాష్ట్రమంతా మిగతా 2లో

# మోడీ.. రెడీ

- లోక్ సభ ఎన్నికల ప్రచారానికి సిద్ధం
- బీహార్‌లోనే ఎలక్షన్ ఫస్ట్ క్యాంపెయిన్ మీటింగ్
- 40 స్థానాల కోసం బీజేపీ విస్తృత ప్రణాళికలు
- వచ్చే రెండు నెలల్లో అమిత్ షా, జేపీ నడ్డా పర్యటనలు



**విశాల భారత, స్టేట్‌బ్యూరో:**

దేశంలో ఏప్రిల్ -మేలో జరగనున్న లోక్ సభ ఎన్నికల కోసం సన్నాహాలు జరుగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ త్వరలోనే ఎన్నికల ప్రచారం మొదలుపెట్టనున్నారు. జనవరి 13న బీహార్‌లో జరగనున్న బహిరంగ సభతో దేశ వ్యాప్త ప్రచారానికి మోదీ శ్రీకారం చుట్టనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. "బీహార్‌లోని 40 లోక్ సభ స్థానాలను కైవసం చేసుకునేందుకు బీజేపీ విస్తృత ప్రణాళికలు రచించింది. అందులో భాగంగానే బహిరంగ సభలతో ముమ్మర ప్రచారం చేపట్టనుంది. జనవరి 13న రాష్ట్ర పర్యటనతోనే ఎన్నికల ప్రచారానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టనున్నారు. రాష్ట్రంలోని బేగూసరాయ్, బెతియా, ఔరంగాబాద్ ర్యాలీల్లో మోదీ పాల్గొననున్నారు. ఆ రోజు పలు అభివృద్ధి పనులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు" అని పార్టీ వర్గాలు వెల్లడించాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా వచ్చే మిగతా 2లో



## ఎన్నికల ముందు జీతాలు పెంచమంటే ఎలా?

- ఉద్యోగులకు వ్యతిరేకం కాదు
- మున్సిపల్ కార్మికుల 21 వేల వరకు జీతాలు పెంచాం
- ఉద్యోగులు కమ్యూనిస్టుల ట్రాప్ లో పడొద్దు
- మంత్రి బొత్స సత్యనారాయణ

**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్:**

ఏపీలో ప్రస్తుతం సమ్మెల సీజన్ నడుస్తోంది. అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు.. ఇలా మూడు విభాగాల వారు రోడ్లెక్కారు. ఆమధ్య వాలంటీర్లు కాస్త హడావిడి చేసినా తర్వాత ఆ వ్యవహారం సద్దుమణిగింది. ఇంతమంది ఆందోళన చేస్తుంటే వైసీపీ ప్రభుత్వం అంత కటువుగా ఎందుకు ఉంది అనే ప్రశ్న వినిపించడం సహజం. అయితే తమ ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకం కాదని అంటున్నారు మంత్రి బొత్స సత్యనారాయణ. అంగన్వాడీలయినా, మున్సిపల్ కార్మికులయినా, ఉపాధ్యాయులయినా.. తమకు అందరూ ఒకటేనన్నారు.

### అన్నీ చేయాలంటే ఎలా..?

అంగన్వాడీలు 11 సమస్యలు తమ ముందు ఉంచారని.. అందులో 10 సమస్యల పరిష్కారానికి ఒప్పుకున్నామని తెలిపారు మంత్రి బొత్స. జీతాన్ని పెంచాలనే డిమాండ్ కి మాత్రం ఇప్పటికిప్పుడు అంగీకరించలేకపోయామని అన్నారు. సరిగ్గా ఎన్నికల ముందు జీతాలు పెంచాలనడం సరికాదని, 4 నెలలు తర్వాత తమ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చాక ఆలోచన చేస్తామని అన్నారాయన. ఇప్పుడే చేయాలంటే మాత్రం కుదరదని తేల్చి చెప్పారు బొత్స. ఐదేళ్ల ప్రభుత్వంలో జీతాలు పెంపు గురించి ఒకసారే ప్రస్తావన ఉండాలని, రెండు మూడేళ్లకు జీతాలు పెంచాలనడం ధర్మం కాదన్నారు మంత్రి బొత్స. జీతాలు ఎంత పెంచినా సరిపోవని, మానవతా దృక్పథంతో ఆలోచన చేయాలని ఉద్యోగులను తాము కోరినట్టు చెప్పారు. ఉద్యోగులకు తాము వ్యతిరేకం కాదని, కానీ చట్టం తన పని తాను చేసుకుని పోతుందని స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికులకు రూ.21వేలకు జీతాలు పెంచామని అన్నారు బొత్స. కమ్యూనిస్ట్ ల మాటలు విని, సమ్మెల పేరుతో ఉద్యోగులు, ప్రజల్ని ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఇలా చేస్తే ప్రజలు క్షమించరన్నారు. వెంటనే సమ్మె విరమించి విధుల్లో చేరాలని ఆయా విభాగాల ఉద్యోగులకు మంత్రి బొత్స పిలుపునిచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వారి డిమాండ్లన్నిటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## మంత్రి కోమటిరెడ్డిని పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి



హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో చేరిన రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ని, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని, వారికి అందిస్తున్న చికిత్స గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కి డాక్టర్లు అడ్వాన్స్‌డ్ రోబోటిక్ టెక్నాలజీ ద్వారా 'థైమెక్టమీ' సర్జరీ చేశారు.

- విశాల భారతి, స్టేట్‌బ్యూరో

### కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల..

## కో ఆర్డినేటర్ల నియామకం

- ఇప్పటికే ఎలక్షన్ కమిటీ ఎంపిక
- దూకుడు పెంచిన హస్తం పార్టీ
- లోక్‌సభ ఎన్నికల కోసం వేగంగా అడుగులు



**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే పదేండ్లు అధికారానికి దూరమైన ఆ పార్టీ.. ఈ సారి ఎలాగైనా గెలుపొంది తీరాలన్న పట్టుదలతో ఉంది. నానాటికీ బలోపేతమవుతూ ఎన్నికల్లో జైత్రయాత్ర కొనసాగిస్తున్న బీజేపీకి ఈసారి ఎలాగైనా బ్రేకులు వేయాలని చూస్తోంది. ఇప్పటికే సుమారు 30 పార్టీలతో జట్టు కట్టి భారీ విపక్ష కూటమి 'ఐఎన్డీఐఏ' (ఇండియా) ఏర్పాటు చేసిన కాంగ్రెస్, ఎన్నికల కోసం పార్టీ శ్రేణులను సంస్థాగతంగానూ సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేలోగానే వీలైనంత మంది అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కసరత్తు చేసి, ప్రకటించాలని చూస్తోంది. తద్వారా సదరు అభ్యర్థికి ప్రచారానికి ఎక్కువ సమయం దొరుకుతుంది. కొన్ని రాష్ట్రాలో అభ్యర్థులను షెడ్యూల్ కంటే ముందే ప్రకటించిన చోట్ల గెలుపు అవకాశాలు పెరిగాయని గుర్తించింది. అందుకే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేలోగా రాజకీయ కార్యాకలాపాలను వేగవంతం చేస్తోంది. తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు పీసీసీ కమిటీలను ప్రకటించిన కాంగ్రెస్, తాజాగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మిగతా 2లో

## ప్రజాపాలన దరఖాస్తులపై నేడు సీఎం రివ్యూ

- వెబ్‌సైట్ ప్రారంభించనున్న రేవంత్‌రెడ్డి
- హాజరు కానున్న మంత్రులు, ముఖ్య అధికారులు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

గత నెల 28 నుంచి ఈనెల 6 వతేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన లో అందిన దరఖాస్తుల పరిశీలన, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సోమవారం సెక్రటేరియట్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి లతో పాటు వివిధ శాఖలకు చెందిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేకంగా నియమించిన నోడల్ అధికారులు, సి.జి.జి డైరెక్టర్ జనరల్, జీహెచ్ఎంసీ కమిషనర్ తదితర ఉన్నతాధికారులు మిగతా 2లో

# సిట్టింగ్ లే మా కొంప ముంచారు



### మార్చి ఉంటే కచ్చితంగా గెలిచెటోల్లం

- పార్లమెంట్ ఎన్నికల్లో అలాంటి పొరపాట్లు జరగనివ్వం
- బీఆర్ఎస్ కే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి
- పథకాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతాం
- జహీరాబాద్ లోక్‌సభ సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సిట్టింగులను మార్చి ఉంటే బాగుండేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో అలాంటి పొరపాట్లు జరగనివ్వం అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్లో జహీరాబాద్ లోక్సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసిన వాళ్లు ఇప్పుడు పునరాలోచనలో పడ్డారన్నారు. తెలంగాణ భవన్‌లో జహీరాబాద్ లోక్‌సభ సన్నాహక సమావేశం జరిగింది. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడింట ఒకవంతు సీట్లు గెలిచామన్నారు. అప్పులు చూపించి హామీల నుంచి తప్పించుకోవాలని కాంగ్రెస్ చూస్తోందన్నారు.

మిగతా 2లో

# రేవంత్.. వన్ మంత్!

**మొదటిపేజీ తరువాయి**

ఇటీవలే ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ఆయన తన మంత్రి వర్గ సహచరులతో కలిసి కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. ఇలా టీమ్ వర్క్ అంటూ ముందుకు సాగుతున్నారు. సింగిల్‌గా కాకుండా రేవంత్‌రెడ్డి అందరితో మింగిల్ అవుతున్నారు.

ఇక తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్ ట్వీట్ చేశారు. సంకెళ్లను తెంచి, స్వేచ్ఛను పంచి జనం ఆకాంక్షలను నిజం చేస్తూ సాగిన ఈ నెల రోజుల ప్రస్థానం ఎంతో తృప్తినిచ్చిందన్నారు. నెలరోజుల ప్రయాణం కొత్త అనుభూతిని ఇచ్చిందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రేవంతన్నగా పిలిచే తనను తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఇక ముందు కూడా తన బాధ్యత నిర్వర్తిస్తానని ఆయన అన్నారు. 'నెలరోజుల పాలనలో ప్రజలకు మరింత చేరువ అయ్యాం' అని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. నెల రోజుల కాంగ్రెస్ పాలన ప్రజారంజకంగా సాగిందని ఆ పార్టీ సీనియర్ నేత మల్లు రవి అన్నారు. నెలరోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి తనదైన మార్క్ పాలనతో ప్రజల మనస్సును చూరగొన్నారన్నారు. వన్ మంత్ పాలనలో రేవంత్ తనదైన మార్కుతో ముందుకు సాగిపోతున్నారు. ఇక వంద రోజుల్లోపు ఆరు గ్యారంటీలు అమలు చేసి లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు గెలిచే స్ట్రాటజీతో సీఎం రేవంత్ అడుగులు వేస్తున్నారు.

## సంకెళ్లను తెంచి.. స్వేచ్ఛను పంచి..

**మొదటిపేజీ తరువాయి**

గ్రామ గ్రామాన ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి 'అభయ హస్తం' దరఖాస్తులు స్వీకరించింది. ఈ నేపథ్యంలో ఈ 30 రోజుల పాలనను రీకాల్ చేస్తూ.. రేవంత్‌రెడ్డి ఆసక్తికర ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రిగా నెలరోజుల పాలన తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందని, కొత్త అనుభవాన్ని ఇచ్చిందని సోషల్ మీడియాలో 'ఎక్స్' వేదికగా ఆయన ట్వీట్ చేశారు. 'సంకెళ్లను తెంచి, స్వేచ్ఛను పంచి జనం ఆకాంక్షలను నిజం చేస్తూ సాగిన ఈ ప్రస్థానం తృప్తినిచ్చింది' అని రాసుకొచ్చారు. తాము 'ప్రజా సేవకులమే తప్ప.. పాలకులం కాదు' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. నెలరోజుల పాలన తనకు కొత్త అనుభూతిని కలిగించిందని అభిప్రాయ పడ్డారు. పేదలు, యువత, ఆడబిడ్డల ముఖాల్లో ఆనందం చూశానని, రైతులకు భరోసా ఇచ్చామని ప్రస్తావించారు. పెట్టుబడులకు కట్టుబడి ఉన్నామని, పారిశ్రామిక వృద్ధికి పెద్దపీట వేస్తూ, నగరాల అభివృద్ధికి పాటుపడతామని వివరించారు. రాష్ట్రంలో మత్తు లేకుండా చేసేందుకు ప్రయత్నించామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. బెల్ట్ షాపుల మూసివేత నిర్ణయం గురించి పరోక్షంగా ట్వీట్‌లో ప్రస్తావించారు. తనను గుండెల్లో పెట్టుకున్న తెలంగాణ హృదయంలో శాశ్వతంగా నిలిచిపోయేలా ఇక ముందు మరింత బాధ్యతగా ఉంటానని స్పష్టం చేశారు. మొత్తానికి నెలరోజుల పాలనపై సీఎం రేవంత్ సంతృప్తిని వ్యక్తం చేశారు.

# మోడీ.. రెడీ

**మొదటిపేజీ తరువాయి**

రెండు నెలల్లో బిహార్‌లో విస్తృతంగా పర్యటించనున్నారు. అనేక బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. జనవరి 15వ తేదీ తర్వాత ముమ్మర ప్రచారం ఉంటుందని సమాచారం. సీతామర్హి, మధేపురా, నలందాల్లో అమిత్ షా పాల్గొననుండగా, సీమాంచల్‌లో జేపీ నడ్డా పర్యటించనున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఎదుర్కొనేందుకు విపక్ష పార్టీల కూటమి 'ఇండియా'లో బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. విపక్షాల తరపున ప్రధానమంత్రి అభ్యర్థి రేసులో కూడా నీతీశ్ ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ రాష్ట్రంపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. అయితే రాష్ట్రంలో బీజేపీ అగ్రనేతలు భారీ స్థాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్న నేపథ్యంలో ఆ బాధ్యతలను పార్టీ రాష్ట్ర నాయకుడు చౌదరికి అప్పగించింది అధిష్ఠానం. 2020లో బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన జేడీయూ, 2022 ఆగస్టులో కమలం పార్టీతో బంధాన్ని తెంచుకుంది. ఆర్జేడీ, ఇతర పార్టీలతో కూడిన కూటమితో జట్టుకట్టి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఎనిమిదో సారి నీతీశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకోగా, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. గత లోక్సభ ఎన్నికల్లో బిహార్లో ఎన్డీఏ 39 స్థానాలను కైవసం చేసుకోగా, కాంగ్రెస్ ఒకటి గెలిచింది.



# సిట్టింగ్ లే మా కొంప ముంచారు

**మొదటిపేజీ తరువాయి**

నెల రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అప్రతిష్ఠ మూటగట్టుకుందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరగబోతుందన్నారు. పోటీలో బీఆర్ఎస్కే పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. జిల్లాల సంఖ్య తగ్గించేందుకు సీఎం రేవంత్ కమిషన్ వేస్తామంటున్నారని, కొత్త జిల్లాలు రద్దు చేస్తే ప్రజలు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఒత్తిడి పెంచుతామన్నారు.



## ప్రజాపాలన దరఖాస్తులపై
# నేడు సీఎం రివ్యూ

- వెబ్‌సైట్ ప్రారంభించనున్న రేవంత్‌రెడ్డి
- హాజరు కానున్న మంత్రులు, ముఖ్య అధికారులు

**మొదటిపేజీ తరువాయి**

ఈ సమీక్ష సమావేశానికి హాజరుకానున్నారు. ఈ సమావేశంలో ప్రజాపాలన పై ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్ prajapalana .telangaana .gov .in ను సీఎం ప్రారంభిస్తారు.

**ప్రజాపాలనలో**
**మొత్తం 1,25,84,383 దరఖాస్తులు**

ప్రజాపాలనా జరిగిన పదిరోజుల్లో మొత్తం 1,25,84,383 దరఖాస్తులు అందాయి. వీటిలో ఐదు గ్యారంటీలకు సంబంధించి 1,05,91,636 దరఖాస్తులు కాగా, ఇతర అభ్యర్థనలకు సంబంధించి 19 ,92 ,747 ఉన్నాయి. రాష్ట్రంలోని 16 , 392 గ్రామ పంచాయితీలు, 710 మున్సిపల్ వార్డుల్లో ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహించగా, ఈ గ్రామ సభల్లో 1 ,11 ,46 ,293 మంది పాల్గొన్నారు. ఈ ప్రజాపాలనలో మొత్తం 3 ,714 అధికార బృందాలు పాల్గొని దరఖాస్తుల స్వీకరణకు 44 ,568 కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రజాపాలన సజావుగా జరిగేందుకు పది ఉమ్మడి జిల్లాలు, జీహెచ్ ఎంసీ లోని అయిదు జోన్లకు ఒక్కొక్క సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్‌ను ప్రత్యేక పర్యవేక్షణాధికారులుగా ప్రభుత్వం నియమించింది. ఈ దరఖాస్తులన్నింటినీ జనవరి 17 లోగా డేటా ఎంట్రీ ని పూర్తి చేయాలని సంబంధిత కలెక్టర్లను సీఎస్‌శాంతి కుమారి ఆదేశించారు.

జిల్లాల వారీగా అందిన అప్లికేషన్ల వివరాలు (లక్షల్లో)

1. హైదరాబాద్ - 13.7
2. రంగారెడ్డి - 10.2
3. మేడ్చల్ మల్కాజిగిరి - 9.2
4. నల్గొండ - 6.1
5. నిజామాబాద్ - 5.9
6. ఖమ్మం - 5.5.
7. సంగారెడ్డి - 4.4
8. సిద్ధిపేట - 3.8
9. సూర్యాపేట - 4.2
10. జగిత్యాల - 3.9
11. భద్రద్రీ కొత్తగూడెం - 3.7
12. కరీం నగర్ - 3.5.
13. వరంగల్ - 3.3
14. మహబూబ్ నగర్ - 3.2
15. వికారాబాద్ - 3.1
16. మెహబూబాబాద్ - 3.1
17. కామారెడ్డి - 3.1
18. హనుమకొండ - 2.93
19. మంచిర్యాల - 2.83
20. నిర్మల్ - 2.80
21. మెదక్ - 2.73, 22. పెద్దపల్లి - 2.69
23. యాదాద్రి భువనగిరి - 2.54
24. ఆసిఫాబాద్ - 2.20
25. రాజన్న సిరిసిల్ల - 2.15
26. నారాయణ పెట్ - 2.09
27. నాగర్ కర్నూల్ - 2.03
28. జోగులాంబ గద్వాల్ - 1.95
29. కొమురంభీం ఆసిఫాబాద్ - 1.82
30. జయశంకర్ భూపాల్ పల్లి - 1.46
31. ములుగు - 1.10

# ఆరు గ్యారెంటీలు ఏమైనట్టు?

- కేంద్రం నిధులు ఇస్తుందనే గ్యారెంటీలు ఇచ్చారా?
- కాళేశ్వరం విచారణ ఎందుకు చేయరు?
- కేసీఆర్ తో కాంగ్రెస్ లీడర్లు కమ్మక్కు అయ్యారా?
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ప్రభుత్వంపై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందనే.. ప్రజలకు ఆరు గ్యారెంటీలు ఇచ్చారా అంటూ నిలదీశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలతో పాటు మిగతా హామీలు కూడా నిలబెట్టుకోవాలని సూచించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు తప్పకుండా వస్తాయని, గతంలో భారీగా నిధులు ఇచ్చిందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐ విచారణను ఎందుకు కోరడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు న్యాయ విచారణ కేవలం కాలయాపన కోసమేనన్న ఆమె... కాళేశ్వరం అవినీతి సీబీఐ చేత విచారణ చేయించాలని కోరారు. కమీషన్ల కోసం ప్రాజెక్ట్‌ను నాణ్యతాలోపంతో కూడిన డిజైన్ చేశారని మండిపడ్డారు. సీబీఐ రాష్ట్రంలోకి రాకుండా గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జుడిషియల్ ఎంక్వైరీ అంటే కాలయాపన చేయడమేనని డీకే అరుణ ఆరోపించారు. మెడిగడ్డ బ్యారేజి కుంగడం, అన్నారం పంపులు మునగడానికి ప్రాజెక్టు డిజైన్ లోపమే కారణమని అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనకు వంద రోజుల టైమ్ అడిగారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి ఉండాలని సూచించారు.



# బీజేపీ, కాంగ్రెస్ ఫేక్ ప్రచారం

- బోయినపల్లి సరిత ఎవరో తెలియదు
- ఇంటిపేరు ఒక్కటైతే బంధువని ప్రచారం చేస్తారా?
- మాజీ ఎంపీ వినోద్ కుమార్ ఫైర్

**విశాలభారతి,హైదరాబాద్:**

మాజీ ఎంపీ వినోద్ కుమార్ బీజేపీ, కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆదివారం ఉదయం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. బోయినపల్లి సరిత తన అన్న కూతురు అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెకు విద్యుత్ శాఖలో ఉద్యోగం ఇచ్చామని ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారన్నారు. ఫేక్ వార్తను బీజేపీ, కాంగ్రెస్ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిందన్నారు. అసలు తనకు అన్న అంటూ ఎవరు లేరని, ఇన్వెస్టిగేషన్ జర్నలిజం చేసేటప్పుడు క్రాస్ చెక్ చేసుకోవాలని వినోద్ కుమార్ అన్నారు. తీన్మార్ మల్లన్న వార్త ప్రసారం చేసేటప్పుడు తనను వివరణ కోరలేదన్నారు. బోయినపల్లి సరిత ఇంటి పేరు ఒకటైతే తనకు ముడిపెట్టడం కరెక్టా అని ప్రశ్నించారు. కోట్ల రూపాయలు ముంచి పరారైన నీరవ్ మోదీ ఇంటి పేరు మోదీ ఉంటే.. ప్రధానమంత్రి మోదీకీ కూడా సంబంధం ఉన్నట్లా అని నిలదీశారు.



ఎంపీ ఎన్నికల్లో లబ్ది కోసం బండి సంజయ్ దుష్ప్రచారం చేయించడం సరికాదని వినోద్ కుమార్ వ్యాఖ్యానించారు.

## కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల..
# కో ఆర్డినేటర్ల నియామకం

**మొదటిపేజీ తరువాయి**

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు పార్లమెంట్ నియోజకవర్గాల కోఆర్డినేటర్లను ప్రకటించింది. తద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను మరింత చురుగ్గా నిర్వహించేందుకు వీలవుతుందని భావిస్తోంది. ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ అభ్యర్థుల ఎంపిక కసరత్తును చేపడుతుంది. తొలిదశలో ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ ఒక్కొక్క లోక్‌సభ నియోజకవర్గానికి ముగ్గురేసి ఆశావహుల పేర్లతో జాబితా తయారు చేసే అవకాశం ఉంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనుసరించిన వ్యూహాలను లోక్‌సభ ఎన్నికల్లోనూ అమలు చేయాలని భావిస్తోంది. ఆ క్రమంలో శాస్త్రీయంగా నిర్వహించిన సర్వేలు, అభ్యర్థుల ఆర్థిక, సామాజిక బలాబలాలను బేరీజు వేసుకుంటూ గెలుపు అవకాశాలకే పెద్దపీట వేస్తూ ఈ కసరత్తు నిర్వహించే అవకాశం ఉంది.

ఇదిలా ఉంటే, అభ్యర్థులను ఎంపిక కసరత్తు పూర్తిచేసి పేర్లను ప్రకటించేలోగా ఆయా నియోజకవర్గాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహించేందుకు వీలుగా పార్లమెంట్ కోఆర్డినేటర్లను నియమించి, వారికి బాధ్యతలు అప్పగించింది. వీరంతా ఆయా నియోజకవర్గాల్లో ప్రచార కార్యక్రమాలు, ఎన్నికల వ్యూహాలను అమలు చేసే విషయంలో కీలక పాత్ర పోషించనున్నారు. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు ప్రకటించిన కోఆర్డినేటర్లలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రివర్గంలోని మరికొందరు నేతలు, పార్టీ సీనియర్ నేతలున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిలకు కాంగ్రెస్ హైకమాండ్ రెండేసి నియోజకవర్గాల బాధ్యతల్ని అప్పగించింది.

**తెలంగాణ కోఆర్డినేటర్ల జాబితా:**

1. ఆదిలాబాద్ (ఎస్టీ), అనసూయ (సీతక్క)
2. పెద్దపల్లి (ఎస్సీ) , డి. శ్రీధర్ బాబు
3. కరీంనగర్, పొన్నం ప్రభాకర్
4. నిజామాబాద్ , టి.జీవన్ రెడ్డి 5. జహీరాబాద్ - పి.సుదర్శన్ రెడ్డి
6 మెదక్ - దామోదర రాజనరసింహ
7. మల్కాజిగిరి - తుమ్మల నాగేశ్వరరావు
8. సికింద్రాబాద్ - భట్టి విక్రమార్క మల్లు
9. హైదరాబాద్ - భట్టి విక్రమార్క మల్లు
10. చేవెళ్ల - ఎనుముల రేవంత్ రెడ్డి
11. మహబూబ్ నగర్ - ఎ. రేవంత్ రెడ్డి
12. నాగర్ కర్నూల్ (ఎస్సీ) - జూపల్లి కృష్ణారావు
13. నల్గొండ - ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి
14. భువనగిరి - కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
15. వరంగల్ (ఎస్సీ) - కొండా సురేఖ
16. మహబూబాబాద్ (ఎస్టీ) - పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
17. ఖమ్మం - పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



# వైభవంగా
# కొమురెల్లి మల్లన్న లగ్గం

**విశాల భారతి, సిద్దిపేట/ స్టేట్‌బ్యూరో:**

భక్తుల కొంగు బంగారం కొమురవెల్లి మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. వధువుల తరపున మహాదేవుడి వంశస్థులు కన్యాదానం చేయగా.. వరుడి తరపున పడిగన్నగారి వంశస్థులు స్వీకరించారు. అనంతరం బలిజ మేడలమ్మ గొల్ల కేతమ్మలను మల్లికార్జునుడు పెళ్లాడాడు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని పీఠాధిపతి సిద్ధలింగ రాజదేశికేంద్ర శివాచార్య మహాస్వామి పర్యవేక్షణలో వేదపండితులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని కొమురవెల్లి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ వేడుకను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. మల్లికార్జున స్వామికి, మేడలాదేవి, గొల్ల కేతమ్మ అమ్మవార్లకు ప్రభుత్వం తరపున మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆఫీసర్లు అన్ని సౌకర్యాలు కల్పించారు.

**ప్రత్యేక బస్సులు నడుపుతున్న ఆర్టీసీ**

హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. రెండు రోజుల పాటు స్వామివారి కల్యాణోత్సవ వేడుకలను ఆలయ వర్గాలు వైభవంగా నిర్వహించనున్నాయి. ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా స్వామివారి రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉదయం 9 గంటలకు స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చణ, అనంతరం మహామంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, మహా మంగళహారతి కార్యక్రమాలు జరుగుతాయి.





## కేసీఆర్‌ను పరామర్శించిన
# మాజీ గవర్నర్

- ఆయన నివాసానికి నరసింహన్ దంపతులు
- అతిథులకు కేసీఆర్ దంపతులు పట్టువస్త్రాలు
- సంప్రదాయ పద్ధతిలో అతిథి మర్యాదలు

**విశాలభారతి,హైదరాబాద్:**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ను తెలంగాణ మాజీ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ పరామర్శించారు. కేసీఆర్ ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బంజారాహిల్స్లోని నందినగర్ చేరుకున్న మాజీ గవర్నర్ దంపతులు కేసీఆర్తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. నరసింహన్ దంపతులను తొలుత బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరలో పూర్తిస్థాయిలో కోలుకోవాలని మాజీ గవర్నర్ నరసింహన్ ఆకాంక్షించారు. కేసీఆర్ సతీమణి శోభతో పాటు ఇతర కుటుంబసభ్యులను పలకరించారు. కేసీఆర్ నివాసానికి వచ్చిన అతిథులకు కేసీఆర్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి సంప్రదాయ పద్ధతిలో అతిథి మర్యాదలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్



గౌడ్, కొప్పుల ఈశ్వర్, ఎంపీ జోగినపల్లి సంతోశ్కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాజీ హోంమంత్రి మహమూద్ అలీ కూడా కేసీఆర్ను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# భవిష్యత్ బీఆర్ఎస్‌దే

- 100 రోజుల తర్వాత కాంగ్రెస్ పప్పులు ఉడకవు
- పార్లమెంటులో తెలంగాణ గళం వినిపించాలి
- అధికారం కోల్పోయినా కార్యకర్తల్లో మునుపటి ఉత్సాహమే
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్రావు



**విశాలభారతి,హైదరాబాద్:**

కాంగ్రెస్ ప్రభుత్వం తీరు తాము మంచి చేయం, కేసీఆర్ చేసిన మంచిని తుడి చేస్తామన్నట్లుగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్రావు అన్నారు. కేసీఆర్ ఎంతో ఆలోచించి దేశంలోనే వినూత్నంగా ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమైన చర్యని మండిపడ్డారు. హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో నిర్వహించిన జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాలు జరుగుతున్న తీరును చూస్తుంటే అధికారం కోల్పోయినప్పటికీ కార్యకర్తల్లో మునుపటి ఉత్సాహమే ఉందని ఆ పార్టీ సీనియర్ నేత హరీశ్రావు హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమిని దిగమింగుకుని పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలనే పట్టుదల నాయకులు, కార్యకర్తల్లో కనిపిస్తోందని అన్నారు. లోపాలను సమీక్షించుకుని పార్లమెంటు ఎన్నికల నాటికి వాటిని పునరావృతం చేయొద్దని పార్టీ పట్టుదలగా ఉందని చెప్పారు. తాము చేసిన అభివృద్ధితో పాటు దిల్లీలో కేంద్రంతో తెలంగాణ సమస్యలపై బీఆర్ఎస్ చేసిన పోరాటాన్ని ప్రజలకు గుర్తు చేసి ఓట్లు అడుగుదామని పిలుపునిచ్చారు. పార్లమెంటులో తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్ఎస్ ఎంపీల సంఖ్య బలంగా ఉండాలని చెప్పారు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్సభలో లేకపోతే కాంగ్రెస్, బీజేపీలు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్లు ఉంటుందని ఆరోపించారు. విభజన సమస్యలు ఇంకా పెండింగ్లోనే ఉన్నాయని, తెలంగాణకు న్యాయం చేయడం కాంగ్రెస్, బీజేపీ వల్ల కాదన్నారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ సమస్యలను పరిష్కరించదు, కాంగ్రెస్ నిలదీయదని ధ్వజమెత్తారు. తెలంగాణ పాలిట బీజేపీది మొండి చేయి, కాంగ్రెస్ది తొండి చెయ్యి అని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించే బదులు బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమని మాజీ మంత్రి హరీశ్రావు విమర్శలు చేశారు. బీఆర్ఎస్కు బలం ఉంది, కార్యకర్తల బలగం ఉంది, ఎవరూ అధైర్య పడొద్దని హితవు పలికారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాల ఏర్పాటు చేసుకుంటే వాటి స్వరూపాన్ని కూడా మార్చాలని చూడడం దుర్మార్గం కాదా అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజా పాలనలో దరఖాస్తుల్లో జాప్యం జరగకూడదు : ప్రజాపాలన పేరిట దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో 1.25 కోట్ల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వాటికి ఏ మాత్రం జాప్యం చేయకుండా మోక్షం కల్పించండని ప్రభుత్వాన్ని కోరారు. అడ్డగోలు నిబంధనలతో కోతలు పెడతామంటే కుదరదని చెప్పారు. వంద రోజుల తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పప్పులు ఉడకవని బదులిచ్చారు. పార్టీ తరఫున తప్పులు జరిగి ఉంటే కార్యకర్తలు మన్నించాలని విన్నవించుకున్నారు. భవిష్యత్ బీఆర్ఎస్దేనంటూ సమావేశాన్ని మాజీ మంత్రి హరీశ్రావు ముగించారు.

## మే నెలాఖరు కల్లా సీతారామ కాలువల
# పనులు పూర్తి చేయండి

- సత్తుపల్లి, పాలేరు టన్నెల్ నిర్మాణాల పనులు స్పీడప్‌చేయాలి
- లిఫ్ట్ఇరిగేషన్ స్కీమ్ పై ఉన్నతస్థాయి సమీక్ష లో మంత్రి 'తుమ్మల'



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ఈ ఏడాది మే నెలాఖరు కల్లా సీతారామ కాలువల పనులు అన్నీ పూర్తి చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్షసందర్భంగా సీతారామ పనుల పురోగతి, చేపట్టాల్సిన కార్యాచరణపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మంత్రి తుమ్మల పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సాగు నీరందించే ఉద్దేశంతో చేపట్టిన సీతారామ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా సమీక్షించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారవు గారు మాట్లాడుతూ.. పెండింగ్ లో ఉన్న సీతారామ ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల అధికారులకు ఆదేశాలుజారీ చేశారు. అనుకున్న స్థాయిలో పనుల్లో వేగం పెంచితే ఈ ఏడాదిలోనే వైరా ప్రాజెక్టు, లంకా సాగర్, ఎన్నెస్పీ ఆయకట్టులోని సుమారు లక్షా 60 వేల ఎకరాలకు సాగు నీరు అందించే విధంగా పనులు పూర్తి చేయాలి. ఇప్పటికే ప్రాజెక్టుకు సుమారు రూ.7500 కోట్లు ఖర్చు చేశారని అన్నారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి మూడు పంప్ హౌజ్ లు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. ఏన్కూరు వద్ద లింకు కెనాల్ పనులకు టెండర్లు పూర్తి చేసి పనులు మొదలుపెట్టి వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సుమారు రూ.70 కోట్లతో ఈ పనులుపూర్తి చేస్తే వచ్చే సీజన్ లోనే వైరా ప్రాజెక్టు, లంకసాగర్, బేతుపల్లి పరిధిలో ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉందన్నారు. ఇటీవల గండుగులపల్లిలో జరిగిన సమావేశంలో సమీక్షించిన అంశాలను ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి మంత్రి తుమ్మల తీసుకెళ్లగా..సంబంధిత పనులను దశల వారీగా ప్రాధాన్యతను బట్టి పూర్తిచేసి మే నెలాఖరు కల్లా పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. యాతాలకుంట భూసేకరణ పూర్తయితే సత్తుపల్లి టన్నెల్ ద్వారా లంకసాగర్, బేతుపల్లి కెనాల్ కు ఈ సీజన్ లోనే సాగునీరు అందించే అవకాశం ఉందని తుమ్మల తెలిపారు. సీతారామ కాలువల పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మే నెలాఖరు కల్లా అన్ని ప్రాంతాల్లో కాలువల నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఏన్కూరు వద్ద కాలువ పనులు పూర్తి చేస్తే..అక్కడి నుంచి వైరా ప్రాజెక్టుకు లింకు కెనాల్ కలిపే పనులు చేపట్టవచ్చని ..ఈ పనులకు సంబంధించి వెంటనే టెండర్లు ఆహ్వానించాలని నీటి పారుదల శాఖ అధికారులకు మంత్రి తుమ్మల సూచించారు. ఈ పనులు పూర్తయితే..సీతారామ ద్వారా నీరు ఎన్నెస్పీ ఆయకట్టుకు నీరు అందించేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. లింకు కెనాల్ పనులు పూర్తి చేస్తే.. వైరా జర్వాయర్ తోపాటు లంకాసాగర్ కు నీరు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. సత్తుపల్లి ట్రంకు కెనాల్ కు సంబంధిచి భూ సేకరణకు చెల్లించాల్సిన రూ.12కోట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణ నిధులు చెల్లించి వెంటనే పనులు చేపడితే యాతాలకుంట ట్రంకు పనులు పూర్తి చేయవచ్చని సూచించారు. అదేవిధంగా పాలేరు టన్నెల్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాలేరు టన్నెల్ ద్వారా పాలేరు రిజర్వాయర్ కు సైతం నీరు అందించే అవకాశం ఉంటుందని అధికారులకు సూచించారు. పై పనులన్నీ పూర్తి చేస్తే వైరా రిజర్వాయర్ కింద లక్షా 60 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించవచ్చని మంత్రి తుమ్మల అభిప్రాయపడ్డారు. ఈ సమీక్ష సమావేశంలో రెవెన్యూశాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.



## వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను
# సద్వినియోగం చేసుకోండి

**ఎంపీ ధర్మపురి అర్వింద్**

**బాల్కొండ, విశాల భారతి:**

పల్లెల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పేర్కొన్నారు. బాల్కొండ నియోజకవర్గం మెండోర మండలం దూదిగమ్ గ్రామంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతో కేంద్రం గ్రామ గ్రామాన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను నిర్వహిస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమన్నారు. సంకల్ప యాత్ర ద్వారా గ్రామాలకు వచ్చే అధికారులకు ఆయా పథకాలకు సంబంధించిన అప్లికేషన్లు సమర్పించవచ్చని సూచించారు. ఇప్పటికే 40 వేళ అప్లికేసన్స్ వచ్చాయని తెలిపారు. అనంతరం కేంద్ర పథకాల వివరాలతో రూపొందించిన క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు,ప్రజా ప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# మోడీపై అనుచిత వ్యాఖ్యలు

## ముగ్గురు మంత్రులపై మాల్దీవుల సర్కారు వేటు

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముగ్గురు మాల్దీవుల మంత్రులపై ఆదేశ ప్రభుత్వం కన్నెర్ర చేసింది. వారిపై తక్షణ చర్యలు తీసుకుంది. ముగ్గురు మంత్రులను సస్పెండ్ చేసింది. సస్పెండైన వారిలో మరియం షియున, మాల్షా, హసన్ జిహాన్ ఉన్నారు. భారత ప్రధాని ఇటీవల కేంద్ర పాలిత ప్రాంతమైన లక్షద్వీప్‌లో పర్యటించి సాహసాలు చేయాలనుకునే వారు తమ లిస్ట్‌లో లక్షద్వీప్‌ను కూడా చేర్చుకోవాలని అన్నారు. దీనిపై మాల్దీవుల మంత్రులు తమ అక్కసు వెళ్లగక్కారు. పర్యాటక రంగంలో మాల్దీవులతో పోటీ పడలేరని, లక్షద్వీప్ ఎన్నో సమస్యలు ఎదుర్కొంటోందని ట్వీట్లు చేశారు. తమ దేశం అందించే సర్వీసులను లక్షద్వీప్‌లో అందించలేరని, గదుల్లో దుర్వాసనే అతిపెద్ద సమస్య అని అక్కసు వెళ్లగక్కారు. మోదీని 'క్లోన్', 'తోలుబొమ్మ' అంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై భారతీయులు, పలువురు సెలబ్రెటీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. మాల్దీవుల ట్రిప్‌ను రద్దు చేసుకున్నారు. పర్యాటకంగా మాల్దీవుల్ని బహిష్కరించాలని కామెంట్లు చేశారు.

## డైరీ, క్యాలెండర్
# ఆవిష్కరణకు రండి

## స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు టీఎన్జీవో నేతల ఆహ్వానం



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ముజీబ్ ఆదివారం తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 24న నిర్వహించే '2024' డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. స్పీకర్‌సానుకూలంగా స్పందించి వస్తానని చెప్పారని ముజీబ్‌తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అన్ని సంక్షేమ కార్యక్రమాల్లో ఉద్యోగులు తమకు కేటాయించిన పనిని సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఉమర్ ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, వైదిక్ శస్త్ర, ముస్తఫా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి
# భూమి పూజ

**బాల్కొండ, విశాల భారతి:**

బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎంపీ నిధుల నుండి రూ.4.5లక్షలు మంజూరు చేయడం జరిగింది. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంఘం సభ్యులు ఆదివారం భూమి పూజ చేశారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి ప్రోత్సహంతో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ నిధులను మంజూరు చేశారని సంఘం సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారికి సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మండల ప్రధాన కార్యదర్శి లాబిశెట్టి భానుచందర్, యువ మోర్చా మండల అధ్యక్షులు బద్దం సురేష్, కిషన్ మోర్చా జిల్లా ఐటీ సెల్ కార్యదర్శి నాగరాజు,నాయకులు గాదేపల్లి రమేష్,అంగు రమేష్,భార్గవ్,రఘు, పడగల్ యాదవ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నెల రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం
# ప్రజలకు చేరువైంది

- ఇరిగేషన్, సివిల్‌సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- జవాబుదారితో కూడిన పాలన అందిస్తామని హామీ

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నెల రోజుల పాలనపై నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. పార దర్శకత, జవాబుదారీతనం, సమర్థవంతమైన పాలనకు ప్రభుత్వ నిబద్ధత ఇది నిదర్శనమని అన్నారు. నెల రోజుల పాలన పై ఆదివారం నాడు ఆయన ఒక ప్రకటన చేస్తూ ప్రజలకు మరింత చేరువయ్యాం' అని ప్రజలతో బలమైన అనుబంధాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని ఉద్ఘాటించారు. పౌరుల సమస్యలను పరిష్కరించేందుకు మంత్రులు, అధికారులు నిరంతరం అందుబాటులో ఉన్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల్లో జవాబుదారీతనం, పారదర్శకతపై ప్రభుత్వ దృష్టిని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. సానుకూల మార్పును తీసుకురావడానికి తీసుకున్న స్పష్టమైన చర్యలను హైలైట్ చేస్తూ, "ప్రజా పాలన ఎలా ఉండాలో ఒక నెలలోనే మేము ప్రదర్శించాము" అని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు కొత్త స్వాతంత్ర్య భావాన్ని గ్రహిస్తున్నారని, నియంతృత్వ పాలన ముగియడం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేశారని మంత్రి పేర్కొన్నారు. పౌరుల అంచనాలకు అనుగుణంగా పాలన అందించాలనే ప్రభుత్వ నిబద్ధతను ఆయన స్పష్టం చేశారు.

గత నెల రోజులుగా నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల పనితీరును అంచనా వేసేందుకు పలు సమీక్షా సమావేశాలు నిర్వహించామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. "కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ నష్టం తదితర అంశాలపై సమీక్షించాం, కాళేశ్వరం ప్రాజెక్టు ఉన్నతాధికారులతో పాటు మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చాం. ఈ విషయాన్ని ప్రజలకు, మీడియాకు తెలియజేశాం. కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణకు సిట్టింగ్ జడ్జిని నియమించాలని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరామని ఆయన చెప్పారు. "పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్ర జలవనరుల శాఖను కలిసి విజ్ఞప్తి చేసేందుకు నేను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లాం. రాష్ట్రంలోని రైతులకు సాగునీరు అందించేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాం. ," అని వివరించారు. గత బిఆర్ఎస్ పాలనా లోపం వల్ల పౌర సరఫరాల శాఖ రూ.58 వేల కోట్లకు పైగా అప్పులు చేసిందని ఆయన తెలియజేశారు. ఇంకా, గత బిఆర్ఎస్ పాలన ద్వారా పేదలకు సరఫరా చేయబడిన బియ్యం కిలో రూ.39 వెచ్చిస్తున్నప్పటికీ 70 శాతానికి పైగా బియ్యం నేరుగా వినియోగించడం లేదని, కిలో రూ.5కే ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని, ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీటి పారుదల మరియు పౌర సరఫరాల శాఖలో పారదర్శకమైన మరియు జవాబుదారీతనంతో కూడిన పాలన కొనసాగిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు.



## బోరబండ ఇబ్రహీం ఇంటికి కేటీఆర్..

### ఆతిథ్యం స్వీకరించిన మాజీ మంత్రి

విశాలభారతి,హైదరాబాద్: నగర పరిధిలోని బోరబండకు చెందిన ఇబ్రహీం ఇంట్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆతిథ్యం స్వీకరించారు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ఇబ్రహీంకు ధన్యవాదాలు తెలిపిన కేటీఆర్.. విందుకు వస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు ఆదివారం ఇబ్రహీం ఇంటికి వెళ్లగా.. కుటుంబీకులు సాదర స్వాగతం పలికారు. దివ్యాంగులైన తన పిల్లలకు ఆసరా పెన్షన్ అందించాల్సిందిగా గతంలో ట్విట్టర్‌లో విజ్ఞప్తి చేస్తే వెంటనే.. స్పందించి పింఛన్ మంజూరు చేయించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీం కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న కేటీఆర్.. తనకు ఆతిథ్యం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇబ్రహీం పిల్లలకు చెవుడుతో బాధపడుతుండగా.. వారికి అవసరమైన చికిత్సకు ఖర్చులు అందించేందుకు ముందుకు వచ్చారు. ఓ సాధారణ పౌరుడు తమ ప్రభుత్వ సేవలకు గుర్తింపుగా తన ఇంటికి ఆహ్వానించడం తనకు అత్యంత సంతోషాన్ని ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. ప్రజా జీవితంలో ఇలాంటి సంఘటనలు మరింత నిబద్ధతతో ప్రజల కోసం కష్టపడేలా స్ఫూర్తినిస్తాయన్నారు.



### సోనియా గాంధీ మీద పోటీ చేయకుండా..

# రాష్ట్రం ఇచ్చిన రుణం తీర్చుకోవాలి

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ● బీఆర్ఎస్ దోపిడీపై ప్రధాని వెనక్కి తగ్గడమెందుకు..

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీని మన రాష్ట్రం నుంచి పార్లమెంటు స్థానానికి పోటీ చేయాలని కోరామని, సోనియా గాంధీ పోటీ చేసే పార్లమెంటు స్థానం నుంచి తెలంగాణపై నిజమైన ప్రేమ ఉన్న ఏ పార్టీలు పోటీ చేయవద్దని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఆయన ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ రుణాన్ని ఈ విధంగా తీర్చుకోవాలని, బీఆర్ఎస్ పార్టీకి కాళేశ్వరం ఏటీఎం లాగా మారిందని ప్రధానమంత్రి మోడీ హోం మంత్రి అమిత్ షా లు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. కాళేశ్వరం నిర్మాణంలో దోపిడీ జరిగిందని కేంద్ర దర్యాప్తు సంస్థలు, ఏజెన్సీలు ఇచ్చిన సమాచారం ప్రకారమే మోడీ, అమిత్ షా లు మాట్లాడి ఉండవచ్చని, కేంద్రంలో ఉన్న బీజేపీ దగ్గర కాళేశ్వరం దోపిడి గురించి పూర్తి సమాచారం ఉన్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ కేంద్రంలోని బీజేపీ కుమ్మక్కయ్యారు కాబట్టే కాళేశ్వరంపై కేంద్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని, రాష్ట్ర బీజేపీ నాయకులు బాధ్యత లేనట్టుగా నోటికొచ్చినట్టు మాట్లాడటం సరికాదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో 15 లక్షల నగదు జమ, నోట్ల రద్దు సమయంలో బయటికి తీస్తానన్న నల్లధనం గురించి బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు.

అంతేకాకుండా.. 'మోసం మోసమని బతికే బీజేపీ లాగా కాంగ్రెస్ ఉండదు. రాష్ట్రంలో చిన్న భిన్నంగా ఉన్న పాలన వ్యవస్థను గాడిలో పెట్టి జవాబు దారి పాలన అందిస్తున్నాము. గత ఐదు సంవత్సరాల నుంచి ఉద్యోగులు 21వ తారీకు వరకు జీతాలు తీసుకున్న దుస్థితి నుంచి మొదటి వారంలోనే జీతాలు ఇచ్చే ఆర్థిక స్థితికి మెరుగు పరిచాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక అరాచకత్వంపై శ్వేత పత్రం విడుదల చేసాం. విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా జెన్కో, ట్రాన్స్ కో, డిస్కోల్లో ఉన్న అప్పులను బయట పెట్టాం. వ్యవసాయ శాఖలో సమీక్ష చేసి ప్రజలకు జవాబుదారీగా భూసార పరీక్షలు పెంచి రైతులకు అధికార యంత్రాంగాన్ని అందుబాటులో ఉండే విధంగా సమయాత్తం చేశాం. కాళేశ్వరం కార్పొరేషన్ పేరిట లక్ష కోట్ల రూపాయలు అప్పు తెచ్చి అధోగతి పాలు చేసిన కాళేశ్వరం గురించి వాస్తవాలు బయట పెట్టాం. మిషన్ భగీరథలో జరిగిన అవకతవకలపై నివేదిక తయారవుతున్నది త్వరలో బయట పెడతాం.



పోలీస్ వ్యవస్థను ప్రక్షాళన చేసి అతిపెద్ద సవాల్ గా మారిన డ్రగ్స్ నిరోధానికి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు ఆర్థిక సహాయ సహకారాలు అందించి ఆ శాఖకు కావాల్సిన నిధులను మంజూరు చేశాం. 6 గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి పథకంలో ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని ప్రారంభించి ఇప్పటి వరకు 6.50 కోట్ల మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాం. ఆరోగ్యశ్రీ కింద పది లక్షల రూపాయలకు సాయాన్ని పెంచి పేదలకు వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చాం. విద్యా, వైద్య ఉపాధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ప్రణాళిక సంఘాన్ని తిరిగి పునరుద్ధరణ చేసాం. శాఖకు సీనియర్ ఐఏఎస్ అధికారిని సెక్రటరీగా నియమించాం. ఆర్థిక వనరులను సక్రమంగా ప్రణాళిక బద్ధంగా రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం వెచ్చిస్తాం. రాష్ట్రంలో పెద్ద ఎత్తున పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం. పైరవీలు, ప్రశ్న పత్రాలు లీకు కాకుండా పకడ్బందీగా టిఎస్పిఎస్సి ద్వారా పరీక్షల నిర్వహణకు చర్యలు చేపట్టాం. నిరుద్యోగ యువతకు ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అనుగుణంగా పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. సంక్షేమ రంగంపై ఇందిరమ్మ ప్రభుత్వం లోతైన అధ్యయనం చేస్తున్నది ఇంక్లూసివ్ గ్రోత్లోకి ప్రజలను తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రాష్ట్రంలో ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ఒత్తిడి లేని పాలన అందిస్తామని చెప్పినట్టుగానే చేస్తున్నాం. శాంతి భద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. ప్రజల ధన మాన ప్రాణాలు కాపాడటం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతగా గుర్తించి అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకుంటున్నాం. పైరవీకారులు, తాబేదారులకు తావు లేకుండా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా 30 రోజులు ప్రజాపాలన అందించింది. ప్రజలు ఇచ్చిన ఈ పదవులను హోదాగా కాకుండా బాధ్యతగా స్వీకరించి పారదర్శకంగా జవాబుదారీగా ప్రజాపాలన అందించాం. ఆరు గ్యారెంటీల హామీల అమలుకు ప్రజాపాలన ద్వారా దరఖాస్తులను స్వీకరించాం. రాష్ట్రంలో విద్యా, వైద్యం బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాం. ప్రభుత్వ యూనివర్సిటీలను బలోపేతం చేసి విద్యార్థులందరికీ ప్రపంచీకరణలో భాగంగా పెరుగుతున్న పోటీ తత్వాన్ని ఎదుర్కొనే విధంగా వృత్తిపరమైన కోర్సులు తీసుకురావడానికి ఆలోచన చేస్తున్నాం. ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఈ ప్రభుత్వం సంకల్పిస్తున్నది. ప్రజల అవసరాలు తీర్చేటు వంటి స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు తీసుకువస్తాం.' అని భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.



# వైసీపీ సినిమా క్లోజ్

## ఇంటికెళ్లడం ఖాయం

### టీడీపీ హయాంలో ఆక్వా రంగానికి పెద్ద పీట

### జగన్ కు విశ్వసనీయత ఉందా?

### 'రా .. కదలిరా' బహిరంగ సభలో చంద్రబాబు

**విశాలభారతి,ఆంధ్ర ప్రదేశ్:**

నిత్యావసర ధరలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా టీడీపీజనసేన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంటలో నిర్వహించిన ' రా .. కదలిరా' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని మొత్తం 15 అసెంబ్లీ స్థానాల్లోనూ టీడీపీ గెలవాలని అన్నారు. వైసీపీ సినిమా అయిపోయిందని, త్వరలో ఇంటికెళ్లడం ఖాయమని వ్యాఖ్యానించారు. గత ఐదేళ్లలో మీ జీవితాల్లో ఏదైనా మార్పు వచ్చిందా? జిల్లాలో ఎక్కడైనా కాలవల్లో పూడిక తీశారా? ఈ ప్రభుత్వం వచ్చాక అన్ని ఛార్జీలను పెంచేశారు. టీడీపీ హయాంలో ఆక్వా రంగానికి పెద్ద పీట వేశాం. జగన్ పాలనలో ఈ రంగం పూర్తిగా కుదేలైంది. సాగు ఖర్చు మూడు రెట్లు పెరిగింది. జగన్ ప్రభుత్వం వచ్చాక ఫీడ్, కరెంట్ బిల్లులు పెరిగాయి. మేం అధికారంలోకి వచ్చాక ఆక్వా రంగానికి రూ.1.5కే కరెంట్ ఇస్తాం. దీనికి పూర్వ వైభవం తెచ్చే బాధ్యత మాది. ధాన్యం కొనకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారు. కనీసం గోనె సంచులు కూడా ఇవ్వలేకపోతున్నారు. నీరు సరిగా ఇవ్వక క్రాప్ హాలిడే ఇచ్చే పరిస్థితి తెచ్చారు. మేం వచ్చాక రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటాం. జగన్ పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయింది. వైసీపీ దుష్టపాలనను అంతం చేయాలని చంద్రబాబు అన్నారు.

జగన్ విశ్వసనీయత..నేతి బీరకాయ : జగన్ విశ్వసనీయత..నేతి బీరకాయ చందంగా ఉందని చంద్రబాబు విమర్శించారు. ప్రత్యేక హోదా తెస్తామని అధికారంలోకి వచ్చిన జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. కేంద్రం మెడలు వంచుతామని చెప్పారు.. వంచారా? అని ప్రశ్నించారు. ఏటా జాబ్ క్యాలెండర్ అన్నారు. ఒక్క ఉద్యోగమైనా ఇచ్చారా? డీఎస్సీ అన్నారు.. ఒక్క నోటిఫికేషన్ వేయలేదు. కరెంట్ ఛార్జీలు పెంచబోమని చెప్పి 9 సార్లు పెంచారు. జగన్ వచ్చాక గుత్తేదారులను మార్చారు.. అధికారులను మార్చారు. పోలవరం ప్రాజెక్టును గోదావరిలో కలిపేశారు. పోలవరానికి గ్రహణం వీడాలంటే జగన్ ఇంటికి పోవాలని ఆయన వ్యాఖ్యానించారు.



ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు : అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఉద్యోగం వచ్చేవరకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. " తెలుగు ప్రజలు ప్రపంచంలోనే నెంబర్‌వన్ కావాలి. ఆనాడు డ్వాక్రా సంఘాలు నేనే తెచ్చాను. ఆడబిడ్డలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని కోరుకున్నా. నాకు ఇటీవల కష్టం వచ్చినప్పుడు 80 దేశాల్లోని తెలుగువారు స్పందించారు. సంపద సృష్టించడం ఎలాగో మాకు తెలుసు. తాడేపల్లిగూడెంకు ఎన్ఐటీ తెచ్చాం. భారతీయ విద్యాభవన్ భూములు కాజేసేందుకు ఆచంట ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారు. ఆయన జాగ్రత్తగా ఉండాలి. కాజేసిన ప్రతి ఆస్తినీ స్వాధీనం చేసుకుంటాం. ఆచంటలో రొయ్యల చెరువు తవ్వాలంటే ముడుపులు కట్టాల్సిందే. పేదల ఇంటి జాగాకు కూడా రూ.50 వేలు కప్పంకట్టాల్సిన పరిస్థితి ఉందని చంద్రబాబు అన్నారు. తాడేపల్లిగూడెంలోనూ ఇదే పరిస్థితి. అక్కడ ఏం చేయాలన్నా అక్కడి నేతకు పన్ను కట్టాల్సిందే. జగన్‌లా భీమవరం ఎమ్మెల్యే కూడా ఒక ప్యాలస్ కట్టుకున్నారు. నరసాపురం నాయకుడు ప్రభుత్వ భూములు కాజేస్తున్నారు. అవినీతి చేస్తున్న ఈ నేతలను కూడా మారుస్తారో లేదో జగన్ చెప్పాలి. తెలుగు ప్రజలు తెలివైనవారని అంతటా పేరుంది. వైసీపీ నేతల మాటలు నమ్మి మరోసారి మోసపోకుండా జాగ్రత్తపడాలి. ఇప్పటికైనా చైతన్యం రాకుంటే రాష్ట్రం అంధకారమే అవుతుందని చంద్రాబు అన్నారు. రాష్ట్రానికి స్వర్ణయుగం రావాలంటే ' రా.. కదలిరా' అని పిలుపునిచ్చారు.





# బాదిత కుటుంబాలను పరామర్శించిన సునీల్ కుమార్

**బాల్కొండ, విశాల భారతి:**

బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన పలు బాదిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. గ్రామానికి చెందిన అన్నారం మహేశ్ గుండెపోటుతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. అలాగే అదే గ్రామానికీ చెందిన అన్నారం తిరుపతికి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జైత్రయాత్రలా వైసీపీ సామాజిక బస్సు యాత్ర

## పోటెత్తిన జనం



**విశాలభారతి,ఆంధ్ర ప్రదేశ్:**

వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సుయాత్ర జైత్రయాత్రలా కొనసాగుతోంది. 42వ రోజు బస్సు యాత్రకు జనం ఉప్పెనలా తరలివచ్చారు. రాజానగరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో బస్సుయాత్ర జరిగింది. మధ్యాహ్నం రెండు గంటలకు కోరుకొండ మండలం దోసకాయపల్లిలో వైఎస్సార్‌సీపీ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం కోరుకొండ వరకూ బస్సుయాత్ర సాగింది. కోరుకొండ బూరుగపూడి గేట్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు హాజరయ్యారు.

**ఊసరవెల్లి చంద్రబాబు: మంత్రి మేరుగ నాగార్జున**

ఊసరవెల్లి మాటలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చంద్రబాబు వాడుకుని వదిలేశారని మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. రాజ్యాంగబద్ధమైన అవకాశాలు రాకుండా చేశారు. చంద్రబాబు హయాంలో బీసీ ఎస్సీలపై అనేక దాడులు పాల్పడ్డారు. కులం, మతం, వర్గం, పార్టీ తారతమ్యం లేకుండా అందరికీ సీఎం జగన్ న్యాయం చేస్తున్నారు. పేదల పిల్లలకు కార్పొరేట్ విద్య చదివించేందుకు అవకాశం కల్పించిన ప్రభుత్వం ఇది. ఆరోగ్యశ్రీ ద్వారా పేద వాడికి 25 లక్షల రూపాయలు ఖర్చు చేసే ఏకైక ప్రభుత్వమిది. పేదలకు 31 లక్షలు ఇళ్ల పట్టాలిచ్చిన నాయకుడు సీఎం జగన్ మాత్రమే అన్నారు.



విశాల భారతి
vishalabharathi
Telugu Daily
సోమవారం 08 జనవరి 2024 హైదరాబాద్



## కేటీఆర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

**షాబాద్, విశాల భారతి:**

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపినట్లు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పీసరి సతీష్ రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని కేటీఆర్ ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ మేరకు కే టీ ఆర్ కి నూతన సంవత్సర, సంక్రాంత్రి శుభాకాంక్షలు చెప్పినట్లు చెప్పారు.

# ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

- 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి
- పందుల సొసైటీలకు ప్రభుత్వ భూమి కేటాయించాలి
- తెలంగాణ షెడ్యూల్ తెగల సంక్షేమ సంఘం




**హైదరాబాద్,విశాలభారతి:**

ఆదివాసి గిరిజన తెగల మధ్య జరుగుతున్న విభిన్న అభిప్రాయాలను దృష్టిలో పెట్టుకొని అన్ని తెగలను కలుపుకొని వారి వారి సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలంగాణ షెడ్యూల్ తెగల సంక్షేమ సంఘం పేర్కొంది. ఈ మేరకు ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద రాష్ట్ర కమిటీ ముఖ్య నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదివాసులు గిరిజనులు అభివృద్ధి చెందడానికి వెంటనే ప్రత్యేక ఎస్టి కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా పెరిగిన ఆదివాసి గిరిజన జనాభా ప్రకారం 12 శాతం రిజర్వేషన్లను విద్యా ఉద్యోగ ఉపాధి సంక్షేమ పథకాలతో పాటు రాజకీయాల్లో కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరుకల ఎంపవర్మెంట్ స్కీము ఆధారంగా 139 పందుల సొసైటీలకు ప్రభుత్వ భూమిని ఒక్కొక్క సొసైటీకి ఐదు ఎకరాల భూమిని కేటాయించాలన్నారు. మైదాన ప్రాంతంలో నివసిస్తున్న 47% ఆదివాసి గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా మైదాన ప్రాంత ఐటిడిఏ కి నిధులు కేటాయించి వారి అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సంజీవ్, వనం రమేష్, ధరావత్ గణేష్ నాయక్, గోవర్ధన్, యాదగిరి, సత్యనారాయణ,బిజిలి ఎల్లేష్, గంగారం తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ రాములోరి అక్షింతలు





**షాబాద్, విశాల భారతి:**

ఇంటింటికి రాములోరి అక్షింతలు పంపిణీ చేస్తామని వరగూడ వినాయక సేవ సమితి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని చర్లగూడ గ్రామంలో హనుమాన్ దేవాలయంలో శ్రీరాముడి అక్షింతల శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికి అక్షింతలను వితరణ చేయనున్నట్లు వివరించారు. అయోధ్య శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఇంటింటికీ అక్షింతల, పంపణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవరి 1 నుంచి 15వ తేదీ వరకు గడపగడపకూ అయోధ్య పూజిత అక్షింతల వితరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక సేవాసమితి సభ్యులు, గ్రామస్తులు తదితరులున్నారు.



## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**షాబాద్, విశాల భారతి:**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడు పిట్టల రమేష్ కి అండగా ఉంటామని పదవ తరగతి మిత్రులు పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల కేంద్రానికి చెందిన పిట్టల రమేష్ ఫిట్స్ వ్యాధితో మృతి చెందాడు. అతని కుటుంబానికి అండగా భార్య మంజులకు రూ.48 వేల 500 రూపాయల నగదును అందజేశారు. వారు మాట్లాడుతూ.. గత డిసెంబర్ 20వ తేదిన ఫిక్స్ వ్యాధితో కాలువలో పడి మృతి చెందిన రమేష్ కుటుంబానికి అండగా నిలిచిన్నట్లు 2001 పదవ తరగతి బ్యాచ్ మిత్రులు అందరూ కలిసి ఆదుకునేందుకు శ్రీకారం చుట్టామన్నారు. పెద్దలు కష్టాల్లో ఉన్నప్పుడూ ప్రపంచమంతా నిన్ను వదిలి వెళ్లిపోయిన నిజమైన స్నేహితులు మాత్రమే వెంటే నిలుస్తారాని గుర్తు చేశారు.

# బీర్ల ఐలయ్య ను సన్మానించిన తెలంగాణ రాష్ట్ర కురుమ సంగం



**మందమర్రి టౌన్, విశాల భారతి:**

తెలంగాణ కురుమ సంగం అధ్యక్షుడు, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యను మంచిర్యాల జిల్లా కురుమ సంగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం, రాష్ట్ర కురుమ సంగం మంచిర్యాల జిల్లా కురుమ సంగం అధ్యక్షుడు గుంట శ్రీశైలం ఆధ్వర్యంలో ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐలయ్య కురుమ వాడు కావడం గర్వించదగ్గ విషయమని, ప్రజల మనిషిగా అందరి మన్ననలు పొందుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ పలు సేవ కార్యక్రమాలు చేపడుతూ, ప్రకృతి విపత్కర సమయంలో కూడా ప్రజల మధ్యలో ఉంటూ సేవ చెయ్యడం వల్లనే ప్రజలు యాభై వేల ఓట్ల మెజార్టీతో గెలిపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏనుగుల బీరయ్య, కొంగొండ మధు, వీనంక శ్రీనివాస్, పెద్దల కుమార్ అధిక సంఖ్యలో కులస్తులు పలుగోన్నారు.



## కరెంట్ షాక్ తో గేదె మృతి

**కల్వకుర్తి, విశాల భారతి:**

కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామంలో కరెంట్ షాక్ తో గేదె మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే జిల్లెల్ల గ్రామానికి చెందిన పట్టపర్ల సత్యనారాయణ అనే రైతు తన వ్యవసాయ పొలంలో రోజు మాదిరిగానే తన గేదే ను గడ్డి మేపుతుండగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వైరు తేలి ఉండటంతో తేలిన విద్యుత్ వైరుకు గేదె తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ. 50వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలి

- చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి
- ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా
- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ







**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు,అండగా ఉంటూ ప్రజా సమస్యలే పరిష్కారంగా ముందుకు వెళతానని ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. భారీ మెజారిటీతో ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని నరేన్ గార్డెన్స్ లో ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలతో కృతజ్ఞత సమావేశాన్ని నిర్వహించారు.కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి గాంధీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ శేరిలింగంపల్లి గడ్డ గులాబీ అడ్డ అని ఎమ్మెల్యే గాంధీని అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నమన్నారు.అదే స్ఫూర్తితో రాబోయే ఎంపీ ఎన్నికలో చేవెళ్ల లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని ఎంపీ తెలియచేసారు. గాంధీ,నేను మీకు ఎల్లవేళలో అండగా ఉంటామని ఎంపీ రంజిత్ రెడ్డి తెలిచేశారు.అనంతరం ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ నా మీద విశ్వాసం ఉంచి ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో నన్ను గెలిపించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.తన గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియచేసారు. బీఆర్ఎస్ పార్టీ కి కార్యకర్తలే పట్టుకొమ్మలు అని, కార్యకర్తలే పార్టీ శ్రీ రామ రక్ష అని,ప్రతి ఒక్కరు బీఆర్ ఎస్ పార్టీ పటిష్టతకు సైనికుడిగా పనిచేయాలని,బీ ఆర్ ఎస్ పార్టీని బలోపేతం చేయాలని పేర్కొన్నారు. అందరికి మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటామని, ప్రతి ఒక్కరం కష్టపడి బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు.వచ్చే ఎంపీ ఎన్నికలు ఎదుర్కోవడానికి పకడ్బంధీ కార్యాచరణతో ముందుకు పోతామని, అదే స్ఫూర్తితో ఎంపీ రంజిత్ రెడ్డిని తిరిగి భారీ మెజారిటీతో మళ్ళీ ఎంపీగా గెల్పించుకుందామని ఎమ్మెల్యే గాంధీ కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు,గౌరవ అధ్యక్షులు ,నాయకులు, కార్యకర్తలు,పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, అభిమానులు, వివిధ కాలనీ వాసులు,తదితరులు పాల్గొన్నారు.

# పాపన్న విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుల్ని శిక్షించాలి

**కల్వకుర్తిలో ధర్నా చేపట్టిన గౌడ సంఘం నాయకులు**



**కల్వకుర్తి, విశాల భారతి:**

కల్వకుర్తి నియోజక వర్గం మాడుగుల మండలం అవురుపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి సమయంలో సర్ధార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఇది పిరికిపందల చర్య అని దుండగుల్ని తక్షణమే అరెస్టు చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ దుర్మార్గానికి ఒడిగట్టిన దుండగులు ఎంతటివారైనా అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, దళిత బహుజనుల ఆత్మగౌరవం దెబ్బకొట్టేలా వ్యవహారిస్తే సహించబోమని కల్వకుర్తి తాలూకా గౌడ సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. పాపన్న విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుల్ని తక్షణమే అరెస్ట్ చేయాలని గౌడ యువజన సంఘం అధ్యక్షులు రుక్కుల్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ గౌడు, కల్వకుర్తి టౌన్ ప్రెసిడెంట్ కార్వంగ శ్రీనివాస్ గౌడ్, గౌడ యువజన సంఘం కోషాధికారి కొమ్మగోని రవి గౌడ్, చేదుర్పల్లి వెంకటయ్య గౌడ్, దామోదర్ గౌడ్, ఆనంద్ గౌడ్, పాండు గౌడ్, నరేష్ గౌడ్, సురేష్ గౌడ్, రాజుగౌడు తదితరులు పాల్గొన్నారు.

# సొంతగూటికి చేరుకున్న రామగౌని మహీధర్ గౌడ్

**మంచిర్యాల, విశాల భారతి:**

తాండూరు మండలంకి చెందిన బిఆర్ఎస్ నాయకుడు రామగౌని మహీధర్ గౌడ్ బిజెపి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి సమక్షంలో పార్టీ జిల్లా కార్యాలయం మంచిర్యాలలో సొంతగూటికి చేరుకున్నాడు. భారతీయ జనతా పార్టీలో మండల అధ్యక్షునిగా పనిచేసిన రామగౌని మహీధర్ గౌడ్ కొన్ని కారణాల వలన ఇటీవలే బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తిరిగి తన సొంత గూటికి చేరుకోవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్ జైన్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్,



మండల ఉపాధ్యక్షులు కోమండ్ల శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాట యోధుడు పనికిర లింగయ్య వర్ధంతి

**లింగయ్య స్తూపాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వేముల వీరేశం**

**శాలిగౌరారం, విశాలభారతి:**

గురజాల గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు పనికిర లింగయ్య ప్రథమ వర్ధంతిని ఆయాన కుటుంబ సభ్యులు, ఎంసిపిఐయూ ఆధ్వర్యంలో ఆదివారం గురజాల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్థూపాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ,టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఎమ్మెల్యే వేముల వీరేశం,టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శాలిగౌరారం మండలం పోరాటాలకు పుట్టిన ఇళ్ళని సాయిధరైతంగా పోరాటంలో యానాల మల్లారెడ్డి తో పాటు పనికిరా లింగయ్య ఎంతోమంది పోరాట యోధులు నాడు రైతాంగ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ ప్రాంతానికి గొప్ప చరిత్ర ఉంది . పనికిర లింగయ్య ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేశారు.ఆయన సేవలు శాలిగౌరారం మండల ప్రజలు మరువలేనివి అని అన్నారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సమరం రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు అన్నెబొయిన సుధాకర్, వేముల గోపినాథ్ , పనికిర కృష్ణ, ఎంసీపీఐయూ నాయకులు అశోక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.





# 'రాములవారి అక్షింతలు వితరణ'

**తుర్కయంజాల్, విశాలభారతి:**

అయోధ్య శ్రీ సీతారాములవారి అక్షింతల వితరణ కార్యక్రమం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి 21వ వార్డు శ్రీరామ్‌నగర్ ఫేజ్ 2లో ఆదివారం నిర్వహించారు. రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు పిలుపు మేరకు శ్రీరామ్‌నగర్ కాలనీ ఫేజ్ 2 అధ్యక్షుడు చెవుల దశరథ ఆధ్వర్యంలో అక్షింతలు, కలశ వితరణ కార్యక్రమం కాలనీలోని సీతారాములవారి దేవస్థానం నుంచి చేపట్టారు. డప్పువాయిద్యాల మధ్య అక్షింతలు, కలశాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ జన్మభూమి అక్షింతలను గడపగడపకూ తీసుకెళ్లాలని సూచించారు. అయోధ్యలో రామాలయం నిర్మించడం దేశానికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రాజుగౌడ్, నర్సింహ, చంద్రకాంత్, గుండ రాజు, నారాయణరెడ్డి, కృష్ణ, మధు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# బిసి 'ఎ' లో చేర్చే వరకు ఉద్యమిస్తాం

## తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర

**శేరిలింగంపల్లి - విశాల భారతి**

ఆర్థికంగా,సామాజికంగా, రాజకీయంగా సమాజంలో అన్ని రంగాలలో వెనుకబాటుకు లోనైనా 'సగర' కులాన్ని బీసీ 'ఎ' లో చేర్చే వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సగరజాతి ఉద్యమిస్తుందని తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మణికొండ సగర సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ, సంఘం నుతన కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సంఘం అధ్యక్షులు దేవేందర్ సగర ఆధ్యక్షతన నిర్వహించిన సభలో శేఖర్ సగర మాట్లాడుతూ సామాజిక చైతన్యం లోపించి ఆర్థికంగా, రాజకీయంగా సగరులు రాణించలేకపోయారని అన్నారు. భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలను పరిగణలోకి తీసుకొని తెలంగాణ రాష్ట్రంలో ఆర్థికంగా అత్యంత వెనుకబాటుకు లోనైనా సగర కులాన్ని బీసీ 'ఎ' లో చేర్చాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. బిసి 'డి' లో ఉండటంతో రిజర్వేషన్లు లేక సగరులు విద్యా, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమ సమాజ





నిర్మాణమే లక్ష్యమని ప్రగల్బాలు పలికే నాయకులు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు సామాజిక కోణంలో సగర జాతికి అన్యాయమే చేస్తున్నారని ఆరోపించారు. పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలతో పోలిస్తే తెలుగు రాష్ట్రాలలో సగరులు బీసీ 'డి' లో ఉండడం సబబు కాదని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న సగరులను బీసీ 'డి' నుంచి 'ఎ' లోకి మార్చే వరకు తెలంగాణ సగర సంఘం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సగర జాతి మరింతగా చైతన్యవంతమై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మణికొండ సగర సంఘం అధ్యక్షులు దేవేందర్ సగర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు బంగారు నరసింహ సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంచంద్రయ్య సగర, గ్రేటర్ హైదరాబాద్ యువజన సంఘం అధ్యక్షులు ఎర్రం శెట్టి సీతారాం సగర, సంఘం గౌరవాధ్యక్షులు మహాదేవ సగర, వెంకటేశ్వర్లు సగర, సలహాదారులు అశోక్ సగర, వెంకటేష్ సగర, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ సగర, సంయుక్త కార్యదర్శి వెంకటేష్ సగర, కోశాధికారి గోపిసగర, మహిళా సంఘం అధ్యక్షురాలు రోజ సగర, ప్రధాన కార్యదర్శి సునిత సగర, ఫిలింనగర్ సగర సంగం అధ్యక్షులు ఈశ్వర్ సగర తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడికి అండ కాంగ్రెస్ జెండా

## వి. జగదీశ్వర్ గౌడ్



**శేరిలింగంపల్లి,విశాలభారతి:**

ప్రతి పేదవాడికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ అన్నారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఆదివారం మియపూర్ డివిజన్ పరిధిలోని స్టాలిన్ నగరలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి,బస్తి స్థానిక ప్రజలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనకు నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనను సాగిస్తుందని, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రతి బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని,ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అన్ని విధాలుగా అందేలా చూస్తామని తెలిపారు. మియపూర్ డివిజన్ పరిధిలోని స్టాలిన్ నగర్ బస్తీలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కోటిగా పరిష్కారం చూపే విధంగా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు .ఈ మేరకు స్థానిక ఇళ్ల పట్టాలు,మంజీర పైప్ లైన్,నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను వారి దృష్టికి స్థానిక ప్రజలు తీసుకువచ్చారు. సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఇలియస్ షరీఫ్,సాంబశివ రావు,మడిమిట్టి కృష్ణ,భాస్కర్ గౌడ్, రామచందర్,రమేష్,ప్రభాకర్, శంకర్,సాయి,రమేష్,రవి కుమార్,అసిఫ్,అరుణ్,సాయి కుమార్ గౌడ్,వేణు,రాజు, ప్రదీప్,రాంబాబు,సురేష్,నవీన్,ప్రవీణ్ కుమార్,ఉదయ్, వెంకట్,మహిళలు కవిత,గీత, విజయలక్ష్మి,వాసవి,లావణ్య పాల్గొన్నారు.





# చామలకు సముచిత స్థానం కల్పించాలి

**శాలిగౌరారం, విశాలభారతి:**

భువనగిరి పార్లమెంట్ టికెట్ ను టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం అవకాశం ఇవ్వాలని మాజీ వార్డ్ మెంబర్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు పనికేరా కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా కృష్ణ ఆదివారం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ నాడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో క్రియాశీలకంగా పాత్ర పోషించినటువంటి చామల కిరణ్ కుమార్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం భువనగిరి పార్లమెంట్ టికెట్ నోకియాటాయించాలని చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తూ ప్రజలకు సేవ చేస్తున్నటువంటి చామల కిరణ్ కుమార్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం గుర్తించి రానున్న పార్లమెంటు ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు.

## సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీలోకి చేరికలు

**నూతనకల్, విశాలభారతి:**

మండల కేంద్రం లోని కామ్రేడ్ గునుగంటి సత్యానారాయణ విజ్ఞాన కేంద్రంలో చిల్పకుంట్ల గ్రామంలో వివిద పార్టీలలో కొనసాగుతున్న పీల్లి వీరయ్య,బోనగిరి మహేష్,బొజ్జ నర్సింహ,బత్తుల మల్లయ్య( జానికి) ,బత్తుల వెంకటనర్సమ్మ,బద్దం శంబి రెడ్డి ఆ పార్టీలకు రాజీనామా చేసి సీపీఐ(ఎంఎల్ ) న్యూ డెమోక్రసీ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేస్తున్న పార్టీ న్యూడెమోక్రసీ అని అందుకే ఆ పార్టీ లో చేరుతున్నాము అని అన్నారు. వీరికి సీపీఐ(ఎంఎల్ )న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్,జిల్లా నాయకులు పెద్దింటి రంగారెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డేవిడ్ కుమార్ మాట్లాడుతూ నిత్యం ప్రజలల్లో ఉంటూ ప్రజల కోసమే పని చేస్తే పార్టీ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అని అన్నారు. పెద్దింటి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పైన ప్రజల తరపున ప్రశ్నిస్తూ ఉండే పార్టీ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అని పార్టీలో చేరినవారికు విప్లవ స్వాగతం పలుకుతున్నామని అన్నారు.



# వీరాచారి రజిత మృతి

## నివాళులు అర్పించిన పలువురు ప్రముఖులు

**సూర్యాపేట, విశాలభారతి:**

జిల్లా కేంద్రంలోని హోటల్ వీరాచారి సతీమణి రజిత అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల పలువురు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలకి కుమారుడు లేకపోవడంతో ఆమె కుమార్తె తలకొరివి పెట్టడంతో పలువురు కంటతడి పెట్టారు. నివాళులర్పించిన వారిలో రియల్ ఎస్టేట్ సంఘం జిల్లా అధ్యక్షులు పంతంగి వీరస్వామి, పట్టణ అధ్యక్షులు జలగం సత్యం గౌడ్, ముత్యాల సైదులు, కుంభం వెంకన్న, కుమారస్వామి, ఉపేంద్రా చారి తదితరులు ఉన్నారు.





## నామినేటెడ్ పదవులు కల్పించి ఆదుకోవాలి

**నూతనకల్, విశాలభారతి:**

గత తొమ్మిదేళ్లు అధికారంలో లేకున్నా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కష్ట నష్టాలు ఎదుర్కొని అహర్నిశలు కృషి చేశామని నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎన్ ఎస్ యుఐ నాయకులకు నామినేటెడ్ పదవులు కల్పించాలని ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షుడు ఉప్పుల మురళి కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అరాచకాలు, ఆగడాలు తట్టుకొని,ఎన్నో తపుడు కేసులు బనాయించిన కానీ వాటిని ఎదుర్కొని కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన ఎన్ ఎస్ యుఐ నాయకులకి రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరుకు రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవిలో యువతకు సముచితమైన స్థానం కల్పించి యువతను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల కోఆర్డినేటర్ మరికంటి అశోక్, ముత్యం ప్రసాద్,లింగంపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు పంతం సాయి , గుండాల ప్రశాంత్, బొడ్డుపల్లి సందీప్, మడ్డి శ్రావణ్, మణికుమార్, గోపి, మహేష్, సాయి, వేణు, ప్రవీణ్,మండల నాయకులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి



## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**తొర్రూరు, విశాలభారతి :**

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమారపు ఐలయ్య అధ్యక్షతన నిర్వహించిన తొర్రూరు జోనల్ స్థాయి విద్యా సదస్సు నందు పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి మాట్లాడుతూ సమాజంలో పేద బడుగు బలహీనవర్గాల, విద్యార్థుల శ్రేయస్సు, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఏకైక ఉపాధ్యాయ సంఘం టి. పి. టి. ఎఫ్ అని అన్నారు. టి పి టి ఎఫ్ భాద్యతలకు నిలబడి హక్కులకై పోరాడుతుంద ని వృత్తినిబద్ధతోపాటు సామాజిక బాధ్యతలను తన భాధ్యతగా తీసుకొని ప్రజా సమస్యల పట్ల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరంకై, ప్రభుత్వ బడుల పరిరక్షణకు, ప్రభుత్వ విద్య పరిరక్షణకు టిపిటిఎఫ్ పోరాటం కొనసాగించడం అభినందనీయం అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ బడుల పరిరక్షణకు తన వంతు సహకారం అందిస్తూ బడుల బలోపేతానికి కృషి చేస్తానని, తన దృష్టికి వచ్చిన అన్ని అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని అన్నారు.



## యధావిధిగా ప్రజావాణి

**సూర్యాపేట, విశాలభారతి:**

జిల్లాలో ప్రజాపాలన కార్యక్రమం ముగియడంతో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం కలెక్టరేట్ లో యధావిధిగా సాగుతుంది. ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# పథకాలు అర్హులైన పేదలకు ఇవ్వాలి

**- సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్లూరి గోవిందు**

**సూర్యాపేట, విశాలభారతి :**

ఆరు గ్యారెంటీ పథకాలు అర్హులైన పేదలకు కచ్చితంగా అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఏలుగూరి గోవిందు ప్రభుత్వాన్ని డిమాండ్చే శారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారాంపురంలో జరిగి సిపిఎం పార్టీ వన్టౌ న్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాల కోసం రాష్ట్ర ప్రజలు ఆశలతో ఎదురుచూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణాలలో పది రోజులుగా గ్రామ సభ ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరిస్తున్నారని , దరఖాస్తు పెట్టుకున్న ప్రతి దరఖాస్తులను పున పరిశీలించి అర్హులైన పేదలకు ఆ పథకాన్ని అందించాలనిbకోరారు. రేషన్ కార్డు లేని వారికి తక్షణం రేషన్ కార్డులు అందించి వారి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు అందే వరకు సిపిఎం పార్టీ ప్రజల పక్షాన ఉంటుందని ప్రజా సమస్యలే పరిష్కారం దీటుగా పోరాటం చేస్తామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ నాయకులు వల్లపు దాసు సాయికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆరు గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం

# క్యాలెండర్ ఆవిష్కరణ



**చిట్యాల, విశాలభారతి**

చేతి వృత్తిదారులంతా ఐక్యంగా ఉన్నప్పుడే వారి సమస్యలు పరిష్కారం అవుతాయని చిట్యాల మాజీ సర్పంచ్ జిట్ట నగేష్ అన్నారు. చిట్యాల మండల కేంద్రంలో ఆదివారం నాడు తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను వివిధ వృత్తిదారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ చేతివృత్తి దారులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించవలసిన బాధ్యత పాలక పక్షాలపై ఉన్నదని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం చేతివృత్తి దారులంతా సంఘటితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, రజకవృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు ఐతరాజు యాదయ్య, అక్కెనపల్లి నాగయ్య, నలపరాజు శేఖర్ ,తీగల కృష్ణయ్య, అమరోజు రాములు, వెలిమినేటి అంజయ్య, నలపరాజు సైదులు, ఐతరాజు శంకర్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# గౌడ సంఘం టౌన్ అధ్యక్షునిగా మారగోని రమేష్



**చిట్యాల, విశాలభారతి:**

పట్టణ గౌడ సంఘం అధ్యక్షునిగా మారగోని రమేష్ గౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం రోజు గౌడ సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశంలో మేకల శివ గౌడ్ అధ్యక్షతన నూతన కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గౌడ సంఘం సీనియర్ నాయకులు మారగోని ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు. ఈ ఎన్నికలో అధ్యక్షులుగా మారగోని రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పబ్బతి సత్యనారాయణ గౌడ్, కోశాధికారిగా రేకుల గడ్డ నరసింహ గౌడ్, ఉపాధ్యక్షులుగా మేకల సురేష్ గౌడ్, పంతంగి వెంకన్న గౌడ్, ఉయ్యాల మల్లేష్ గౌడ్, పుల్లెంల చంద్రయ్య గౌడ్, కాసుల సత్యనారాయణ గౌడ్ సహాయ కార్యదర్శులని సలహాదారులను, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు పెద్దగోని మల్లయ్య గౌడ్, మేకల అంజన్ కుమార్ గౌడ్, గౌడ యువజన అధ్యక్షులు మారగోని శ్రవణ్ గౌడ్, చిన్నగౌడ్ బిక్షం గౌడ్, పల్లె వెంకన్న గౌడ్ ,ముద్దగొని శ్రీనివాస్ గౌడ్, మాధగోని వెంకటేష్ గౌడ్, వీరమల్ల అంజయ్య గౌడ్, కునూరి అంజయ్య గౌడ్ ,బొడ్డు శంకర్ గౌడ్, నేలపట్ల సంతోష్ గౌడ్ పాల్గొన్నారు.

# విష్ణు మరణం తీరని లోటు

## శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**మిర్యాలగూడ, విశాలభారతి:**

దివంగత మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు మరణం బీఆర్ ఎస్ పార్టీకి, పేద వర్గాల ప్రజలకు తీరని లోటు అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు అన్నారు. గత నెల 26వ తేదీన హార్ట్ స్ట్రోక్ తో మృతి చెందిన కుర్ర విష్ణు సంతాప సభను ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని టిఎన్ఆర్ గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ ముందుగా ఆయన ఫోటోకు దండ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విష్ణు పార్టీకి అందించిన సేవలు చిరస్మణీయమన్నారు. ఆయన సేవలు గుర్తు





చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరు నగర్ భార్గవ్, రాష్ట్ర అగ్రోస్ మాజీ చైర్మన్, తిప్పన విజయసింహ రెడ్డి, డీసీ ఎం ఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, పార్టీ యువ నాయకులు గుత్తా అమిత్ రెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, చైతన్య, వింజం శ్రీధర్, సాదినేని శ్రీనివాసరావు ఉన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
www.vishalabharati.com
epaper:vishalabharati.com
vishalabharathi Telugu Daily


# వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలి

- రాష్ట్రం లో రెండు ఎంపీ సీట్లు మాదిగలకు ఇవ్వాలి
- మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి




**తొర్రూరు, విశాలభారతి:** మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో రాయిశెట్టి ఉపేందర్ మాదిగ అధ్యక్షతన తొర్రూర్ పట్టణం లోని అంబేద్కర్ భవన్ లో మాదిగ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి మాదిగ హాజరైనారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి మాదిగ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు ఎత్తివేయడానికి కుట్ర చేస్తుంది ,ఎస్సి వర్గీకరణ పేరుతో మాదిగ,మాదిగ ఉప కులాల ఓట్లను దండుకోవడానికి తెరలేపింది.మాదిగ, మాదిగ ఉపకులాల పట్ల బిజెపి ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సి వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదం తెలిపాలని రవి డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మాదిగలకు రెండు ఎంపీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు బీజేపీ ప్రభుత్వం మతం, కులాల పేరుతో దేశ ప్రజలను విభజించి, పాలిస్తుంది, దళితులు, గిరిజనుల పట్ల అమానుషంగా వ్యవరిస్తుందని ధ్వజ మెత్తారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దళిత, గిరిజన ప్రజల పై దాడులు జరుగుతున్నాయని రవి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బి.వీరేందర్ మాదిగ వినాయక రావు రాయిశెట్టి ఉపేందర్, మాదిగబరిగల బాబు మాదిగ మహంకాళి మల్లేష్,మధుకర్, దుప్పటి కిషోర్, నాగరాజు, కన్నంసు నీల్, సురేష్ పాల్గొన్నారు.



# అయోధ్యలో అద్భుతం

## నేరుగా సూర్యకిరణాలు రామయ్య పైన

**అయోధ్య:** దేశంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అద్భుత కట్టడం అయోధ్య రామమందిరం. హిందువులు దైవ స్వరూపంగా కొలిచే రాముడి జన్మస్థలమని భావిస్తున్న అయోధ్యలో ఈ మందిరాన్ని నిర్మిస్తుండటం ఎంతో ప్రత్యేకత సంతరించుకుంది. కాగా అయోధ్యలో ప్రతిష్ఠించే రామయ్య విగ్రహానికి సబంధించిన వివరాలను తాజాగా రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ వెల్లడించారు. 51 అంగుళాల పొడవు, 1.5 టన్నుల బరువుతో కూడిన రాముడి విగ్రహం భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. గర్భాలయ నిర్మాణం ఎంతో ప్రత్యేకంగా ఉంటుందని, రామనవమి రోజు సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు సూర్య కిరణాలు రామయ్య విగ్రహంపై పడతాయని ఆయన తెలిపారు. ప్రతీరోజూ 5 నుంచి 10 నిమిషాల పాటు సూర్య కిరణాలు రాముడి నుదుటిపై బొట్టులా పడేలా నిర్మాణం చేపడుతున్నారు. శ్రీరాముడు నవమి రోజున జన్మించారు. అలాగే ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు జన్మించి ఉంటాడని ఎక్కువమంది విశ్వసిస్తున్నారు. అందుకే ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఐదు నుంచి పది నిమిషాలు సూర్య కిరణాలు నేరుగా రాముడి విగ్రహంపై పడేలా ఆలయం నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. దీన్ని ఆచరణలోకి తెచ్చే బాధ్యతను కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌కు అప్పజెప్పామని, అస్ట్రానమీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఈ నిపుణులు పూణెలో ఉంటారని, వారే దీని కోసం డిజైన్ చేశారని తెలిపారు. సౌర కుటుంబంలోని మార్పులను పరిగణలోకి తీసుకుని సుమారు 19 ఏళ్లు నిరాటంకంగా.. మధ్యాహ్నం పూట గర్భగుడిలోని రాముడి విగ్రహంపై సూర్య కిరణాలు పడేలా నిపుణులు ప్రయత్నాలు చేస్తున్నారని చంపత్‌రాయ్ వెల్లడించారు. అయోధ్య గర్భాలయంలోని రామయ్య విగ్రహ ఎత్తు విషయంలో అంతరిక్ష పరిశోధనలు జరిపే శాస్త్రవేత్తల సలహాలు తీసుకున్నట్లు తెలిపారు. కాబట్టి ప్రతి సంవత్సరం తెలుగు నెలల ప్రకారం చైత్ర మాసం శుక్ల పక్షంలో తొమ్మిదో రోజు రామనవమి వస్తుందని, ఆ రోజున సూర్యుడి కిరణాలు రామయ్య విగ్రహంపై పడేలా ఏర్పాట్లు చేసామన్నారు. సూర్యకిరణాలు స్వామివారి విగ్రహంపై పడినపుడు రామయ్య దేదీప్యమానంగా వెలిగిపోతాడని రాయ్ అన్నారు. దేశంలోనే టాప్ శిల్పులను సంప్రదించి వారిలో ముగ్గురికి రామయ్య విగ్రహాన్ని సుందర్భంగా తీర్చిదిద్దే అవకాశం కల్పించామని అన్నారు. వీరిలో ఒకరు చెక్కిన రామయ్య విగ్రహం 1.5 టన్నుల బరువు, 51 ఇంచుల ఎత్తుతో అద్భుతంగా ఉందని, దాన్ని గర్భగుడిలో ప్రతిష్ఠించాలని నిర్ణయించినట్లు తెలిపారు. నల్లటి రాతితో ఈ విగ్రహాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.




# శవయాత్ర నిర్వహించిన గ్రామస్తులు

**మరిపెడ, విశాలభారతి:** మండలంలో జరుపుల తండా గ్రామ పంచాయతీని రద్దు చేసినందుకు గాను, ఎన్నో సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ చేయాలని కలలుగంటున్న, గిరిజనులు ఆ కళ నెరవేరింది అంటూ సంబరాలు జరుపుకుంటున్నరు. అంతలోనే ఆ గ్రామ పంచాయతీ రద్దు అయినట్టు ప్రకటన వెలబడడంతో ఆ గిరిజనులు కోపంతో టీఆర్ఎస్ నేతల శవయాత్రను నిర్వహించారు.



# పెళ్లి వేడుకలో రెడ్య నాయక్

**మరిపెడ, విశాల భారతి:** మండల అనేపురం ఉమ్మడి గ్రామ పంచాయతీ, మాజీ సర్పంచ్ గుగులోతు చంద్రు నాయక్, కుమారుడి వివాహ కార్యక్రమానికి హాజరైన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి ఎస్ రెడ్య నాయక్ వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటయ్య తండా సర్పంచ్ సూర్య నాయక్, ఉమ్మడి అనేపురం గ్రామ పంచాయతీ సీనియర్ నాయకులు గుగులోతు పెద్ద చంద్రు నాయక్ పాల్గొన్నారు.

# దరఖాస్తులకు ఆందోళన వద్దు



తోకల దుర్గ ప్రసాద్

**భద్రాచలం, విశాలభారతి:** ఎమ్మార్పీఎస్ భద్రాచలం నియోజకవర్గం ఇంచార్జ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలన దరఖాస్తుల ప్రక్రియ ముగిసిందనీ దరఖాస్తు చేసుకోలేక పోయినవారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ ఎందుకంటే ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని ప్రతి నాలుగు నెలలకు ఒకసారి గ్రామసభలు చేపడతామని స్పష్టం చేసారు. ప్రతి ఒక్కరు కూడా గమనించి తొలి విడతలు దరఖాస్తు చేసుకోలేక ఉన్నవాళ్లు మరో విడతలో సమర్పించవచ్చని అయన అన్నారు. అంతేకాకుండా ఎమ్మార్వో ఎంపీడీవో కార్యాలయంలో కూడా ఈ యొక్క దరఖాస్తులను చేసుకోవచ్చు అని తెలిపారు.

# ఎమ్మెల్సీ ఓటుకై దరఖాస్తు చేసుకోండి



చావా శివరామకృష్ణ

**పాలేరు, విశాలభారతి:** నియోజకవర్గంలోని ప్రతి ఒక్క పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పాలేరు నియోజకవర్గ నాయకులు చావా శివరామకృష్ణ తెలిపారు.

**డిగ్రీ 2020 నవంబర్ లోపు పూర్తి చేసినవారు**

ఫిబ్రవరి 6 2024 వరకు తమ ఓటు హక్కు కొరకు డిగ్రీ మెమో ఆధార్ కార్డు ఓటర్ ఐడి పాస్ ఫోటో తీసుకొని తెలంగాణ ఓటర్ ఐడి వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని యువతకు సూచించారు.



# అనాథల పుట్టిన రోజు వేడుకలు

**మరిపెడ, విశాల భారతి:** మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని బాల వికాస కార్యాలయం ఘనంగా నిర్వహించారు. బాల వికాస ఉమెన్ కో ఆర్డినేటర్ సరళ, అమూల్య, మరిపెడ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు సింధూర రవి, సూర్య తేజా ఏజెన్సీస్ ఉప్పల కృష్ణమూర్తి, మహాలక్ష్మి దంపతులు, దంతాలపల్లి కోఆర్డినేటర్ కందుకూరి సుకన్య,మార్గం శోభ,తొర్రూర్ మండల కోఆర్డినేటర్ కె.రమా, వర్ధన్నపేట మండల కోఆర్డినేటర్ రాణి, కోరుకొండ శ్రీదేవి, కందుకూరి వరలక్ష్మి పాల్గొన్నారు. మరిపెడ మండల కోఆర్డినేటర్ ఉపేంద్ర మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలకి ప్రతి సంవత్సరం మహిళల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించి కొత్త బట్టలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సహా కోఆర్డినేటర్స్ జుజూరి ఉపేంద్ర, డోనికేన ఉపేంద్ర, గ్రూప్ లీడర్స్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆన్లైన్ ప్రక్రియ వేగవంతంగా జరగాలి



**మహబూబాబాద్ , విశాలభారతి:** దరఖాస్తుల కంప్యూటరీకరణ వేగవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. ఐడిఓసిలోని సమావేశమందిరంలో ప్రజాపాలన కార్యక్రమంలో అభయహస్తం క్రింద అమలు చేయబోతున్న పథకాల మంజూరికై ప్రజలు సమర్పించిన దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియ ప్రగతిని అదనపు కలెక్టర్ డేవిడ్ తో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దేశగించిన గడువులోగా దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రణాళిక బద్దంగా చేపట్టాలన్నారు. అవసరమైతే అదనంగా కంప్యూటర్ ఆపరేటర్లను నియమించుకోవాలన్నారు. దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియ పూర్తి అయినచోట సిబ్బందిని దరఖాస్తులు ఎక్కువగా ఉన్నచోట ఏర్పాటుచేసి నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, తహసీల్దార్ లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమీషనర్ లు పాల్గొన్నారు.

# ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలింపు



**చిట్యాల, విశాలభారతి:** గుండ్రాంపల్లి గ్రామ పరిధిలో కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడ్డ ఘటనలో పలువురు కూలీలు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రోజు TS34T4985 నెంబర్ గల ఆటోలో సుమారు 13 మంది కూలీలు తమ కూలీ పనులు ముగించుకొని, అందాజా సాయంత్రం 6.30 నిమిషాలకు గుండ్రాంపల్లికి వెళుతుండగా ఆటో డ్రైవర్ నరసింహ తన ఆటోను అతి వేగంగా, అజాగ్రత్తగా నడపి గ్రామ శివారులోని జెబి వెంచర్ వద్ద గల జింకల బొమ్మ సర్కిల్ వద్ద బోల్తా పడవేయటంతో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలు మాలిగ దివ్య, బత్తుల అండాలుకి తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రమేష్ అనే వ్యక్తి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఇరుగు రవికుమార్ తెలిపారు.



# స్కై ఫ్లై ఓవర్ పనులను పరిశీలించిన ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

-సాగర్ రింగ్ రోడ్డు వద్ద తుది దశకు చేరుకున్న ఫ్లైఓవర్ పనులు

**విశాల భారతి,హైదరాబాద్:** ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని సాగర్ రింగ్ రోడ్డు వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులను ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి లింగోజిగూడా డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్బీనగర్ చౌరస్తాని ఫ్రీ సిగ్నల్ చౌరస్తాగా మార్చడం జరిగిందన్నారు. ఎస్.ఆర్.డి.పీ. పనుల్లో భాగంగా దాదాపు 658 కోట్ల రూపాయల వ్యయంతో పనులు చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు. దాదాపు అన్ని ఫ్లైఓవర్లు,అండర్ పాస్ పనులు పూర్తి కావడం జరిగింది. ఎల్.బి.నగర్ జంక్షన్ వద్ద కుడి,ఎడమ ఫ్లై ఓవర్లు,అండర్ పాసులు,నాగోల్ జంక్షన్ ఫ్లై ఓవర్, కామేనిని జంక్షన్ వద్ద రెండు వైపులా ఫ్లై ఓవర్లు,చింతలకుంట జంక్షన్ వద్ద అండర్ పాస్,బైరమల్ గూడ(ఆలేఖ్య టవర్స్) జంక్షన్ వద్ద రెండు ఫ్లైఓవర్లు నిర్మించడం జరిగింది. ప్రస్తుతం ఆలేఖ్య టవర్స్ వద్ద సెకండ్ లెవెల్ నూతన స్కై ఫ్లై ఓవర్ పనులు తుది దశకు చేరుకోవడం జరిగింది అని తెలిపారు.సంక్రాంతి వరకు పనులు పూర్తి స్థాయిలో జరుగుతాయి అని ఆశాభావం వ్యక్తం చేశారు.ఇట్టి పనులు పూర్తి అయ్యాక ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉండవని తెలిపారు.కరోన సమయంలో ఎన్నో కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం వల్లే రోడ్డు వెడల్పు పనులు,ఫ్లై ఓవర్ పనులు వేగవంతంగా చేయడం జరిగిందని తెలిపారు. అట్టి పనుల్లో కొన్ని ఆటంకాలు రావడం జరిగింది. అయిన కూడా మేము భయపడకుండా వారిని ప్రేమతో ఒప్పించి రోడ్డు వెడల్పు పనులు చేయడం జరిగిందని తెలిపారు. అప్పుడు అలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఇప్పుడు మీరు అభివృద్ధి ఫలాలు అనుభవిస్తున్నారు అని తెలిపారు.ఎల్.బి.నగర్ నియోజకవర్గన్నీ ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గజ్జల మధుసూదన్ రెడ్డి,మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికి శ్రీరాముడి అక్షింతలు

నూతనకల్, విశాలభారతి: శ్రీరామ జన్మభూమి అయోధ్యలో పూజలు నిర్వహించిన అక్షింతలు ఆదివారం మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రం సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలో ఇంటింటికి వితరణ చేశారు. భక్తులంతా శ్రీరాముని అక్షింతలు గ్రామానికి చేరుకోవడంతో ఇల్లలో ప్రత్యేక పూజలు చేసి ఇంటికి వచ్చిన అక్షింతలను స్వీకరించి తమ జన్మ ధన్యమైనట్లుగా భావించారు. గ్రామంలో అక్షింతలను పంచుతున్న సమయంలో ఊరేగింపుగా వెళ్లిన భక్తులంతా జైశ్రీరామ్, జైశ్రీరామ్,జయ రామ,జయ జయ రామ అంటూ భక్త నినాదాలు ఇవ్వడంతో ఊరంతా శ్రీరామ నామస్మరణతో మారుమ్రోగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గాడుదుల రజిత లింగరాజు, వార్డు సభ్యులు శీలం నారాయణ,నారగాని యాక స్వామి,గౌడ చర్ల లింగయ్య, నాయకులు జలగం యోగానందం, లింగాల రామచంద్రయ్య,లింగాల వెంకన్న,పసుల రవి యాదవ్, పసుల లింగయ్య, పసుల అవిలయ్య,అనంతుల నాగలింగం, కోడి మల్లయ్య, ఇంజమూరి అప్పయ్య, పురోహితులు ఆమంచి ఉపేందర్, నారగాని రాజేష్, అనంతుల సత్తయ్య, గుండా భరత్ తదితరులు పాల్గొన్నారు.




# సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ లోకి చేరికలు

**నూతనకల్, విశాలభారతి:** మండల కేంద్రం లోని కామ్రేడ్ గునుగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో చిల్పకుంట్ల గ్రామంలో వివిద పార్టీలలో కొనసాగుతున్న పీల్లి వీరయ్య,బోనగిరి మహేష్,బొజ్జ నర్సింహ,బత్తుల మల్లయ్య(జానికి) ,బత్తుల వెంకటనర్సమ్మ,బద్దం శంబి రెడ్డి ఆ పార్టీలకు రాజీనామ చేసి సీపీఐ(ఎంఎల్ )న్యూ డెమోక్రసీ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం పని చేస్తున్న పార్టీ న్యూడెమోక్రసీ అని అందుకే ఆ పార్టీ లో చేరుతున్నాము అని అన్నారు. వీరికి సీపీఐ(ఎంఎల్ ) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్,జిల్లా నాయకులు పెద్దింటి రంగారెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డేవిడ్ కుమార్ మాట్లాడుతూ నిత్యం ప్రజలల్లో ఉంటూ ప్రజల కోసమే పని చేస్తే పార్టీ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అని అన్నారు. పెద్దింటి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పైన ప్రజల తరఫున ప్రశ్నిస్తూ ఉండే పార్టీ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అని పార్టీలో చేరినవారికు విప్లవ స్వాగతం పలుకుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిల్పకుంట్ల గ్రామ కార్యదర్శి దగ్గుల మల్లయ్య, దేసోజ్ మధు, సుంకిరేడి శ్రీనివాస్ రెడ్డి ,మున్న అశోక్ ,మందడి భూపాల్ రెడ్డి ,బిక్కి ప్రవీణ్ ,పెద్దింటి అశోక్ రెడ్డి ,సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com






# జనవరి 9న నా సామిరంగ ట్రైలర్ రిలీజ్

కింగ్ నాగార్జున అక్కినేని హోల్సమ్ ఎంటర్‌టైనర్ 'నా సామిరంగ'. ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అందరినీ ఆకట్టుకునే ప్రమోషనల్ కంటెన్ తో ఆసక్తిని రేకెత్తిస్తోంది. పోస్టర్‌లు, ఫస్ట్ టీజర్, పాటలకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ నా సామిరంగ ట్రైలర్ అప్డేట్ ఇచ్చారు. జనవరి 9న ట్రైలర్ ని విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ట్రైలర్ అనౌన్స్ మెంట్ పోస్టర్ లో కత్తి పట్టుకొని మ్యాసీ లుక్ కనిపించారు నాగార్జున. మంచి ప్రేమకథ, స్నేహం, భావోద్వేగాలు, మాస్, యాక్షన్ ఎలిమెంట్స్ కూడిన నా సామిరంగ సంక్రాంతికి పర్ఫెక్ట్ మూవీ.

# గుంటూరు కారం ట్రైలర్ భారీ ప్రకంపనలు సృష్టిస్తోంది!



క్లాస్, మాస్, ఫ్యామిలీ లేదా యూత్ అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించగల, అన్ని వర్గాలలో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న అరుదైన స్టార్లలో సూపర్ స్టార్ మహేష్ బాబు ఒకరు. అదే విధంగా, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్లను అందిస్తూ, మాస్ ప్రేక్షకుల నుండి కూడా అదేస్థాయిలో ప్రశంసలు పొంది ఎంతో ఖ్యాతిని సంపాదించారు. వీరిద్దరూ కలిసి 'అతడు', 'ఖలేజా' వంటి కల్ట్ క్లాసిక్‌లను అందించారు. ఇప్పుడు, వారు 14 సంవత్సరాల విరామం తర్వాత ఎస్. రాధాకృష్ణ (చిన్నబాబు)కు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ హారిక హాసిని క్రియేషన్స్ కోసం చేతులు కలిపారు. అన్ని కమర్షియల్ వాల్యూస్ తో పూర్తి విభిన్న చిత్రాన్ని అందించాలని వారు నిర్ణయించుకున్నారు. అదే 'గుంటూరు కారం'. గుంటూరుకు చెందిన రమణగా మహేష్ బాబు తన కోసం రాసిన మాస్ పాత్రలో తనదైన శైలిలో ఒదిగిపోయారు. ఆయన పాత్రను తీరుని తెలుపుతూ విడుదల చేసిన గ్లింప్స్ ఇప్పటికే విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు చిత్రబృందం థియేట్రికల్ ట్రైలర్‌ను అట్టహాసంగా విడుదల చేసింది. మహేష్ బాబు డైలాగ్స్, ఆయన యాటిట్యూడ్, ఆయన ఎనర్జీ అన్నీ కూడా ఇటీవలి కాలంలో ఆయన చేస్తున్న చిత్రాలకు భిన్నంగా సరికొత్తగా ఉన్నాయి. దాదాపుగా మహేష్ శైలి ఆయన తండ్రి సూపర్ స్టార్ కృష్ణ గారి స్నేహపూర్వక శైలిని, మాస్ పాత్రలలో బాడీ లాంగ్వేజ్ ని గుర్తు చేస్తుంది.



# 'తండేల్' గ్లింప్స్ విడుదల

'తండేల్' చిత్ర యూనిట్ ప్రీప్రొడక్షన్ పనుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చాలా హార్డ్ వర్క్ చేసింది. ఇప్పుడు సినిమా షూటింగ్ ప్రాసస్ ని ఆస్వాదిస్తోంది. సినిమాకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి, తాజాగా 'తండేల్' సారాంశాన్ని ఆవిష్కరించి విజువల్ ట్రీట్ ను అందించారు మేకర్స్. చేపలు పట్టడానికి సముద్రం మధ్యలో వున్న యువ సామ్రాట్ నాగ చైతన్య పాత్రను పరిచయం చేయడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. 'ఈపాలి యేట..గురి తప్పేదెలేదేస్...ఇక రాజులమ్మ జాతరే' అని చైతు చెప్పిన మ్యాసీ డైలాగ్ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పించింది. అయితే అనుకోకుండా, వారు పాకిస్తాన్ జలాల్లోకి ప్రవేశించినప్పుడు, వారిని కరాచీలోని సెంట్రల్ జైలులో బంధిస్తారు, అక్కడ వారికి కఠినమైన శిక్షలు విధిస్తారు. జైలర్ జాతీయవాదాన్ని ప్రశ్నించినప్పుడు, కథానాయకుడు "మా నుండి ఊడిపోనా ఒక ముక్క... మీకే అంతుంటే.. ఆ ముక్కని ముష్టేసిన మాకెంతుటుంది... భారత్ మాతా కీ జై..." అని జైలర్ కి తగిన సమాధానం ఇస్తాడు. రాజు ప్రేమికురాలిగా సాయి పల్లవి పోషించిన బుజ్జి తల్లి పాత్రని పరిచయం చేయడంతో గ్లింప్స్ ఆహ్లాదకరంగా ముగుస్తుంది. నాగ చైతన్య మునుపెన్నడూ చూడని రస్టిక్ అవతార్‌లో కనిపించారు. శ్రీకాకుళం యాసని అద్భుతంగా పలికారు. చైతు ప్రీప్రొడక్షన్‌కి మంచి సమయాన్ని కేటాయించాడు, ఇందులో మాండలికం,బాడీ ట్రాన్స్ ఫర్మేషన్ లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఆ రావిష్‌నెస్‌ని తన ఫిజిక్, డైలాగ్స్‌లో చూపించారు. దర్శకుడు చందూ మొండేటి గ్లింప్స్ ద్వారా కోర్ పాయింట్‌ని వెల్లడించి, చాలా లేయర్‌లు ఉన్న సబ్జెక్ట్‌ని డీల్ చేయడంలో తన నైపుణ్యాన్ని చూపించారు. చివరి పోర్షన్లలో ప్రేమకథను ప్రెజెంట్ చేసిన తీరు అద్భుతం. ఓవరాల్‌గా, దర్శకుడు మనల్ని అద్భుత ప్రపంచంలో తీసుకెళ్లి, కథనంలో కొన్ని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో విజువల్ ఎక్స్‌ట్రావాగాంజా అందించాడు. గ్లింప్స్ అంతా అత్యద్భుతంగా ఉంది. ఈ క్లిప్‌తోనే సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఇది దృశ్యకావ్యంగా మనసు హత్తుకుని థ్రిల్లింగ్ అనుభూతిని కలిగించింది. ఇది భావోద్వేగాల రోలర్‌కోస్టర్ రైడ్‌ను అందిస్తుంది.

# తిరగబడరసామీ షూటింగ్ పూర్తి



యంగ్ అండ్ ప్రామెసింగ్ హీరో రాజ్ తరుణ్ హీరోగా, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ ఎ ఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న హోల్సమ్ ఎంటర్‌టైనర్ 'తిరగబడరసామీ'. మాల్వి మల్హోత్రా కథానాయికగా నటిస్తోంది. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం సింహభాగం తెలంగాణ రాష్ట్రంలోని జహీరాబాద్లో సరికొత్త లోకేషన్స్ లో చిత్రీకరణ జరుపుకొని, షూటింగ్ ని పూర్తి చేసుకుంది. యువతని ఆకట్టుకునే రోమాన్స్ తో పాటు ఫ్యామిలీని ఆకర్షించే సెంటిమెంట్, మాస్ ని అలరించే హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్ తో ఈ చిత్రాన్ని రూపొందించారు. హిందీ బిగ్ బాస్ తో యావత్ భారతాన్ని అలరిస్తున్న మనరా చోప్రా ఈ చిత్రంలో ఓ విభన్న పాత్రతో పాటు ప్రత్యేక గీతంతో అలరించబోతుంది. ఈ చిత్రంలో మకరంద్ దేశ్‌పాండే, జాన్ విజయ్, రఘు బాబు, అంకిత ఠాకూర్, పృధ్వి, ప్రగతి, రాజా రవీంద్ర, బిత్తిరి సత్తి ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి యువతని ఉర్రూతలూగించే పాటలు, అద్భుతమైన నేపధ్య సంగీతం అందిస్తున్నారు సంగీత దర్శకుడు జేబీ. ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్ కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఫిబ్రవరి మొదటి వారంలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.





# కార్తీక్ రాజు హీరోగా 'ఐ హేట్ యు'

'అథర్వ' ఫేమ్ కార్తీక్ రాజు, మోక్ష, షెర్రీ అగర్వాల్ హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న చిత్రం 'ఐ హేట్ యు'. బి.లోకనాథం సమర్పణలో శ్రీ గాయత్రి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగరాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అంజి రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణను పూర్తి చేసుకున్న ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది.ఈ సందర్భంగా.. చిత్ర నిర్మాత నాగరాజ్ మాట్లాడుతూ ''మా 'ఐ హేట్ యు' చిత్రం లవ్ సైకలాజికల్ చిత్రంగా ప్రేక్షకులను మెప్పించటానికి సిద్ధమవుతోంది. డిఫరెంట్ సబ్జెక్ట్‌తో డైరెక్టర్ అంజిరామ్‌గారు సినిమాను చక్కగా తెరకెక్కించారు. కార్తీక్ రాజు, మోక్ష, షెర్రీ అగర్వాల్ సహా అందరూ నటీనటుల, టెక్నీషియన్స్ చక్కటి సహకారాన్ని అందించటంతో అనుకున్న ప్లానింగ్ ప్రకారం మూవీని పూర్తి చేశాం. అందరికీ థాంక్స్. సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేమలో కొత్త కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలోనే రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తాం'' అన్నారు.

# ఇదే జరిగితే మీనాక్షికి తిరుగుండదు

మీనాక్షి చౌదరి.. డాక్టర్ అయిన ఈ అమ్మడు తొలిసారి ఇచ్చట వాహనములు నిలుపరాదు అంటూ సినీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ తర్వాత రవితేజ సరసన ఖిలాడి చిత్రంలో నటించింది. అయినా ఈ భామకు సరైనా హిట్ పడలేదు. అడవి శేష్ సూపర్ హిట్ మూవీ హిట్-2లో నటించినా.. అనుకున్నంత స్థాయిలో అవకాశాలు దక్కించుకోలేకపోయంది. అందం, టాలెంట్ ఉన్నా టాలీవుడ్ లో ఛాన్సులు అందుకోలేకపోయింది. కానీ అనూహ్యంగా సూపర్ స్టార్ మహేశ్ బాబు సరసన గుంటూరు కారం మూవీలో నటించే సూపర్ ఛాన్స్ కొట్టేసింది. ఇటీవల గుంటూరు కారం నుంచి మీనాక్షి చౌదరి లుక్ కూడా బయటకు వచ్చింది. అందులో పల్లెటూరి అమ్మాయిలా లంగావోణీ వేసుకుని చాలా అందంగా కనిపించింది. ఈ సినిమాలో ఆమె మహేశ్ బాబుకు మరదలుగా నటించిందని సమాచారం. ఈ మూవీలో శ్రీలీల మెయిన్ హీరోయిన్ అయినప్పటికీ ఈమె పాత్రకు ఫుల్ స్కోప్ ఉందట. దీంతో ఈ సినిమాపై మీనాక్షి చాలా హోప్స్ పెట్టుకుందట. ఇప్పటి వరకు పెద్ద సక్సెస్ అందుకోపోయిన ఈ బ్యూటీ.. వరుస అవకాశాలతో బిజీగా మారాలని చూస్తోందట. మొన్నటి వరకు కూడా మీనాక్షి చౌదరి పేరు జనాలకు పెద్దగా తెలియకపోయినా.. ఒక్క మహేశ్ మూవీతో ఫుల్ ఫేమస్ అయిందని నెటిజన్లు అంటున్నారు. మహేశ్ సరసన నటించాక ఫేట్ మారిపోనుందని, ఈ సినిమా ఆమె కెరీర్ దశను మార్చేస్తుందని చెబుతున్నారు. మరోవైపు, ఈ బ్యూటీ.. టాలీవుడ్ లో జాక్ పాట్ ఆఫర్ అందుకుందనే వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. రామ్ చరణ్ - బుచ్చిబాబు కాంబోలో తెరకెక్కనున్న ఆర్ సీ 16 సినిమాలోను సెకండ్ హీరోయిన్ గా ఈ భామ సెలెక్ట్ అయిందట. దీంతో మీనాక్షి చౌదరి బంపర్ ఆఫర్ కొట్టిందని నెటిజన్లు అంటున్నారు. ప్రస్తుతం మీనాక్షి కోలీవుడ్ లో మూడు సినిమాలు చేస్తుండగా... టాలీవుడ్ లో రెండు సినిమాలకు కమిట్ అయినట్లు తెలుస్తోంది.


Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.